ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 14 ఏప్రిల్ 2025 | 5





మారేడుమిల్లిలో రోడ్డుపై కూలిన చెట్టు



రాజమహేంద్రవరంలో మెరుపులు





పిఠాపురంలో భారీ వర్షం.. యు.కొత్తపల్లి మండలంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం

ఈదురుగాలుల బీభత్సం

- 'తూర్పు'లో భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు
- తెగిపడిన విద్యుత్ తీగలు
- గ్రామాల్లో అంధకారం
- తడిచిపోయిన ధాన్యం

కాకినాడ/పిఠాపురం/గొల్లప్రోలు/కొత్తపల్లి/ రాజమహేంద్రవరం సిటీ - ఆంధ్రజ్యోతి): జిల్లాలో గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉదయమంతా ఎండ కాచి ఉక్కబోయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాత్రికి పెనుగాలులు వీచాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కరెంటు స్తంభాలు సైతం కూలిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో అంధకారం అలుముకుంది. గాలుల తాకిడికి రహదారులపై ఇసుక, దుమ్ము సైతం లేచింది. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలతోపాటు ఏజెన్సీ ప్రాంతంలో కూడా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాత్రి 9 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. హోరుగాలితో జనం హడలెత్తిపోయారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కొత్తపల్లి, ప్రత్తిపాడు మండలాల్లోను, కోనసీమ జిల్లాలోని అమలాపురం, అంబాజీపేట, పి.గన్నవరం, కె.గంగవరం తదితర చోట్ల, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంతోపాటు చుట్టుపక్కల మండలాల్లోను భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి విద్యుత్‌స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. తోటల్లో మామిడికాయలు నేలరాలిపోయాయి. ధాన్యం రాశులు తడిచిపోయాయి. నువ్వులు, అపరాలు, ఇతర మెట్ట పంటలు దెబ్బతిన్నాయి. కాకినాడ మెయిన్‌రోడ్డులోను ఓ భారీ వృక్షం నేలకూలింది. రామారావుపేట పాము వారి వీధిలో కరెంటు తీగలపై చెట్టు పడింది. గొల్లప్రోలు-తాటిపర్తి, గొల్లప్రోలు-చెందుర్తి ఆర్‌అండ్‌బీ రోడ్లతోపాటు పలు ప్రధాన రహదారులపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలు నిలిపివేశారు. 50 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలులకు కొత్తపల్లి మండలం ఉప్పాడలో కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఊరిలోనే.. ఉపాధి!

- యువతకు వర్క్‌ఫ్రం హోం
- కూటమి ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్
- సాఫ్ట్‌వేర్‌పైనే ప్రధాన దృష్టి
- ఇంట్లోనే పనిచేసుకునేలా సౌకర్యాల కల్పన
- లేదంటే వర్క్‌ఫ్రం హోం సెంటర్‌కి వెళ్లొచ్చు
- ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు
- ఇప్పటికే పూర్తయిన సర్వే
- పని ఉన్నవారు వేలల్లో.. లేనివారు లక్షల్లో
- సర్వేలో విద్యార్హతలతో సహా తేలిన లెక్కలు
- ఇంటర్‌నెట్ కనెక్షన్ల వివరాలూ నిక్షిప్తం



సొంత ఊరిలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉద్యోగులకు, కంపెనీలకు ఉపయోగపడేలా ఇంటి నుంచే పని (వర్క్‌ఫ్రం హోం) సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తోంది. ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోం విధానం సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన కార్పొరేట్ సంస్థల్లో కొనసాగుతోంది. కొవిడ్-19 తర్వాత చాలా కంపెనీలు దీనిని కొనసాగిస్తున్నాయి. కంపెనీలకు ఈ విధానం సులభంగా ఉండడం, ఆర్థికంగా మేలు జరుగుతుండడంతో పనులు చేయించుకునేందుకు ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయి. తద్వారా ఎక్కువమందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు అనుగుణంగా వర్క్‌ఫ్రం హోంకు అనువైన కేంద్రాలను గుర్తించే పనులు చేపడుతున్నారు.

ఇవీ సర్వే గణాంకాలు

విద్యార్హతలు	తూర్పుగోదావరి	కాకినాడ	కోనసీమ
నిరక్షరాస్యులు	5,095	6,940	3,278
తొమ్మిదిలోపు చదువు	22,202	25,795	23,375
పదో తరగతి	32,791	38,581	39,142
ఇంటర్	36,428	47,094	45,168
డిప్లమో/ఇతరం	9,265	12,923	13,982
ఇంజనీరింగ్	18,600	22,606	23,863
కామర్స్ డిగ్రీ	8,966	9,550	9,663
ఆర్ట్స్ డిగ్రీ	8,718	10,787	10,193
డిగ్రీ ఇతర కోర్సులు	30,282	42,131	37,508
ఎంబీబీఎస్	247	302	239
బీఎల్	218	256	184
పీజీ	11,538	12,924	12,535
పీహెచ్‌డీ	194	227	258
ఇతరులు	4,944	5,991	7,311
ఉద్యోగం/ఉపాధి :			
పనిచేస్తున్నవారు	27,962	30,795	27,337
పనిచేయనివారు	1,61,493	2,05,345	2,01,573
మొత్తం :	1,89,455	2,36,140	2,28,910
బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ :			
ఉన్నవారు :	20,993	20,163	18,873
వైఫై ఫెసిలిటీ	11,511	15,034	12,153
అదనపు వైఫై సౌకర్యం	48,737	61,516	49,452

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం -ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలోనే యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తున్నాయి. అది కూడా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలతోపాటు, విదేశాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. చాలామంది అక్కడి వెళ్లిపోతున్నా.. కొంతమంది మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాలు, నగరాల్లో పనిచేసినా వచ్చే జీతంలో ఎక్కువ ఖర్చులకే అయిపోవడం, తల్లిదండ్రులు, కుటుంబాలకు దూరంగా ఉండాల్సి రావడంతో సొంతూరిలోనే ఏదొక వ్యాపారం, వ్యవసాయం, తమ చదువులకు తగ్గ చిన్న ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి ఇంటి వద్దే ఉంటూ ఐటీ కంపెనీల్లో పనిచేయడానికి వీలున్న యువతను గుర్తించే పనులు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో యువతీయువకులు, అర్హతలు వంటివి సర్వే ద్వారా సేకరించారు.

అందరివీ 'ఐటీ' కలలే..

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఏ విభాగంలో విద్యను అభ్యసించారో కూడా వివరాలు సేకరించారు. అయితే ఈ సర్వేని బట్టి దాదాపుగా అందరూ సాఫ్ట్‌వేర్‌కే ప్రాధాన్యం ఎక్కువ ఇస్తున్నారు. దీంతో తొలుతగా ఆ రంగంలోనే ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా సాఫ్ట్‌వేర్ అభ్యసించిన వాళ్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయారు. కానీ ఐటీ రంగంలో ఆ స్థాయిలో ఉద్యోగ కల్పన లేదు. ఒకవేళ ఉన్నా సుదూర ప్రాంతాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐటీ సెక్టార్‌ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మరింత దుస్థితికి దారితీసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత సాఫ్ట్‌వేర్ చదువుకున్న అభ్యర్థుల కష్టాలను గుర్తించింది. కొందరికి వర్క్‌ఫ్రంహోం సదుపాయాన్ని కంపెనీ కల్పించినా ఇంటి వద్ద సరైన సౌకర్యాలు లేవు. అధిక శాతం మందికి అసలు ఉద్యోగాలే లేవు. స్వల్ప సంఖ్యాకులకు ఉద్యోగం ఉన్నా దూర ప్రాంతాల్లో అతి తక్కువ జీతాలతో నెట్టుకురావాల్సి వస్తోంది. దూర ప్రాంతాల్లో ఇబ్బందులు పడలేక ఉద్యోగం వదిలేసి సొంతూరికి వచ్చి ఏదొక పని చేసుకుంటున్నవాళ్లూ ఉన్నారు. ఈ సమస్యలకు వర్క్‌ఫ్రం హోంతో చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. దానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ చదువరులకు వర్క్‌ఫ్రం హోం కష్టాలు తగ్గించడం, వారికి ఉద్యోగం లేకపోతే ఏదొక కంపెనీ తరపున వర్క్‌ఫ్రం హోం సదుపాయం కల్పించడంపై కసరత్తు జరుగుతోంది. ఒక మండలంలో వివరాల ప్రకారం ఆయా ప్రదేశాల్లో ఒకచోట వర్క్‌ఫ్రం హోంకి అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తారు. అక్కడ కంప్యూటర్లు, వైఫై వంటి సదుపాయాలు ఉంటాయి. ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం సెంటర్‌కి వెళ్లి విధులు నిర్వహించుకోవచ్చు.



వర్క్‌ఫ్రం హోం సర్వే లక్ష్యం ఇదే

వర్క్‌ఫ్రం హోం ద్వారా పనిచేసేందుకు ముందుకు వచ్చే నిరుద్యోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి కూటమి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇంటర్నెట్, ఏసీ సదుపాయం ఉన్న భవనాలను గుర్తించే పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు? ఉద్యోగాలు చేస్తున్నవారు ఏయే కంపెనీల్లో చేస్తున్నారు?, ఇంటి దగ్గరే ఉండి పనిచేస్తున్నారా?, ఆయా కంపెనీలకు వెళ్లి పనిచేస్తున్నారా? వర్క్‌ఫ్రం చేసేవారు ఎక్కడి నుంచి చేస్తున్నారు?, వారు పనిచేసే రూమ్ సైజ్ ఎంత?, ఆ రూమ్‌లో వేరొకరికి చోటు కల్పించే అవకాశం ఉందా?, ఇంటర్నెట్ సౌకర్యం ఉందా?, ఎంత స్పీడ్‌లో నెట్‌ను వినియోగిస్తున్నారు? వంటి వివరాలపై సర్వే నిర్వహించారు. అలాగే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు విద్యార్హతలు ఉన్న వారెందరు? ఉద్యోగాలు చేస్తున్నారా? లేదా? చేయకపోతే కారణాలు?, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలని ఎంత మందికి ఆసక్తి ఉంది? ఇలా వివరాలు సేకరించారు. వీరందరూ త్వరలోనే ఇంటి నుంచి పనిచేసుకునేలా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఎక్కడెక్కడికో సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా ఇంటిపట్టునే ఉంటే.. ఉద్యోగం చేసుకునేలా ఉపాధి చూపనుంది. ఇప్పటికే ఆయా సంస్థల ప్రతినిధులతో కూటమి సర్కారు పెద్దలు సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది.

అంబేడ్కర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయశాస్త్రవేత్తగా, సంఘ సంస్కర్తగా కీర్తించబడిన మహనీయులని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సమాజంలో కుల, మత, లింగ విచక్షణ నిర్మూలనకు, మహిళా సాధికారితకు ఆయన ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ముఖ్యంగా యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయాలకు తగినట్టుగా నడుచుకోవాలని సూచించారు. సోమవారం జరిగే అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలకు శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రశాంతంగా ఆయా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరు పోలీసు వారికి సహకరించాలని కోరారు.



గోకవరం-కొత్తపల్లి రహదారి మధ్యలో మరమ్మతుకు గురైన తొట్టె

పశువుల తొట్టెల నిర్వహణ ఇలాగేనా?

- పశువుల దాహార్తిని తీర్చలేకపోతున్న నీటి తొట్టెలు
- కొత్తవి పూర్తయ్యేదెపుడో

గోకవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. పశువులకు, పలు రకాల జీవాలకు తాగునీరు లభించడం కష్టతరంగా మారింది. గ్రామాల్లో వాటి సౌకర్యార్థం గతంలో ఏర్పాటుచేసిన నీటితొట్టెలు అలంకార ప్రాయంగా మారాయి. కొన్నిచోట్ల తొట్టెల్లో నీళ్లు ఉన్నా అవి తాగడానికి ఏ మాత్రం ఉపయోగపడనివిధంగా ఉన్నాయి. రాజమహేంద్రవరం పశు సంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో చాలా తొట్టెలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. నీటి లభ్యత సరిగా లేనిచోట వాటిని నిర్మించడం, అనువైన ప్రదేశాల్లో వాటి చేపట్టకపోవడమే ఇందుకు కారణంగా పాడి రైతులు చెప్పుకొస్తున్నారు. పంచాయతీ అధికారులు కూడా తొట్టెల సంగతి అసలు పట్టించుకోవడంలేదు. వాస్తవానికి పశువుల తాగునీటి కోసం రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో కొత్తగా ఉపాధి పథకం కింద సుమారు 142 నీటితొట్టెల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ నిర్మించాలన్న వివరాలు తయారు చేయడంతోపాటు, స్థలాల ఎంపిక చేపట్టారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి సుమారు 40 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. వేసవి కాలం గడిచిపోతున్నా తొట్టెల నిర్మాణాల ప్రక్రియ ఎక్కడా కనిపించడంలేదు. గోకవరం మండలంలోని రంపయర్రంపాలెం, గోకవరం, మల్లవరం గ్రామాల్లో 17 పశువుల నీటి తొట్టెలు ఉన్నాయి. వీటిలో 10 నీటి తొట్టెలు ఉపయోగంలో ఉండగా 7 నీటి తొట్టెలు మరమ్మతుకు గురైనట్టు అధికారులు చెబుతున్నారు. కొత్తగా మరో 14 తొట్టెలను ఏర్పాటుచేయడానికి ప్రతిపాదనలు సిద్ధంచేశారు. కానీ మూడింతుల నీటి తొట్టెలు పశువుల దాహార్తిని తీర్చలేకపోతున్నట్టు చెబుతున్నారు.

నెలాఖరు నాటికి పూర్తి చేస్తాం

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను ఈ నెలాఖరునాటికి పూర్తి చేస్తామని రాజమహేంద్రవరం పశుసంవర్ధకశాఖ డీడీ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. ఇప్పటికే తొట్టెల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామని, తొట్టెల నిర్మాణాలు పూర్తిచేసి పశువుల దాహార్తి తీరుస్తామని తెలిపారు.

పేలుడు విషాదం!

- ఉలిక్కిపడిన సామర్లకోట
- అనకాపల్లి జిల్లాలో బాణసంచా ప్రమాదం
- మృతుల్లో ఒకరు సామర్లకోట మండలం వేట్లపాలెం వాసి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు





బాణసంచా ప్రమాదంలో మరణించిన నిర్మల (కింద) ఫైల్‌ఫొటో

సామర్లకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో ఆదివారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో ఎనిమిది మంది మృతి చెందిన ఘటన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఒక మహిళ ఈ ఘటనలో మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో ఈ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. క్షతగాత్రులు ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం ఆందోళన కలిగించింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కూలి పని కోసం సామర్లకోట మండలం వేట్లపాలెంలోని గూడపర్తికి చెందిన గొడత నిర్మల(38) అనే మహిళ కొన్నాళ్ల కిందట వెళ్లింది. బాణసంచా పేలుడు ఘటనలో ఆమె మృతి చెందిందన్న సమాచారంతో ఇక్కడ వేట్లపాలెం, హుస్సేన్‌పురం, సామర్లకోట ప్రాంతాల్లో బాణసంచా తయారీలో ఉన్న వారంతా ఉలిక్కిపడ్డారు. నిర్మల కొంతకాలం కిందట గూడపర్తి గ్రామం నుంచి మరికొందరితో కలిసి బిక్కవోలు సమీపాన కొమరిపాలెంలో బాణసంచా తయారీ పనుల నిమిత్తం అక్కడకు వెళ్లిపోయింది. అక్కడి నుంచి మరికొందరి కూలీలతో కలిసి అనకాపల్లి సమీపాన కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణసంచా తయారీ సంస్థల్లో కూలీ పనుల నిమిత్తం వెళ్లి చాలా కాలమైనట్టు వేట్లపాలేనికి చెందిన పలువురు సహచర కుటుంబీకులు తెలిపారు. నిర్మల స్వతహాగా శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మహిళ కాగా, కొన్నేళ్లుగా ఆమె వేట్లపాలెం గ్రామానికి చెందిన బుజ్జి అనే వ్యక్తితో కలిసి ఉంటున్నట్టు సమాచారం. అలాగే సామర్లకోట పెన్షన్‌లైన్‌కు చెందిన మరికొందరు వ్యక్తులు కూడా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కూలీ పనుల నిమిత్తం వెళ్లినట్టు సమాచారం. వీరిలో మరో ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు సామర్లకోట పట్టణం పెన్షన్‌లైన్‌కు చెందిన వారున్నట్టు సమాచారం రావడంతో వారి శాశ్వత చిరునామాల కోసం రెవెన్యూ సిబ్బంది ఆరా తీశారు. ఇదే ఘటనలో సామర్లకోట పట్టణం పెన్షన్‌లైన్‌కు చెందిన వేళంగి రాజు, భార్య వేళంగి సంతోష్, వేళంగి షరోణి తీవ్ర గాయాలతో విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సామర్లకోటకు చెందిన సత్తిబాబు అనే వ్యక్తి ద్వారా సమాచారం అందింది. ఈ ఘటనతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బాణసంచా తయారీ సంస్థలన్నీ అప్రమత్తం అయ్యాయి. గత దీపావళి ముందురోజు తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంతోపాటు అమలాపురం, అంతకు ముందు సామర్లకోటలోనూ బాణసంచా ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి.



ఇసుక లోడింగ్ (ఫైల్‌ఫొటో)

ఆగని ఇసుక దందా!

- జోరుగా డ్రెడ్జింగ్
- కొంతవరకూ తగ్గిన ధర
- సెమీ మెకనైజ్డ్ రీచ్‌లతో మరింత అందుబాటులోకి?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానం ఇపుడిప్పుడే సరైన దారిలో పడుతోంది. గతంలో పోల్చుకుంటే చాలావరకూ ధర కూడా అందుబాటులో ఉంది. ర్యాంపు నిర్వాహకులు, రాజకీయ నేతల స్వలాభం తగ్గితే మరింత ధర తగ్గే అవకాశం ఉంది. అయితే అఖండ గోదావరిలో రాజమహేంద్రవరం వైపు, కొవ్వూరువైపు రాత్రి వేళ డ్రెడ్జింగ్ కూడా చేస్తున్నారు. డ్రెడ్జింగ్‌తో రాత్రి ఇవాళ గోదావరి ర్యాంపులలో గుట్టలు పెట్టి, పగటిపూట ఇష్టానుసారం అమ్ముకుంటున్నారు. బోట్స్‌మన్ సొసైటీల ముసుగులో ఈ దందా సాగుతోంది. ర్యాంపుల నిర్వాహకులైన రాజకీయ నేతలకు టన్నుకు రూ.50 వంతున 20 టన్నుల ఇసుక లారీకి రూ.1000 ఇవ్వవలసి వస్తోంది. కొందరైతే లారీకి 100 నుంచి రూ.180 వరకూ డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. టన్ను వంతున తమ వాటా తమకు ఇచ్చేసి, ఓవర్‌లోడుతో వ్యాపారం చేసుకోమని కూడా కొందరు సలహా ఇస్తున్నట్టు సమాచారం. నిర్వాహకులు కూడా పడవుల మీద కాకుండా మెకనైజ్డ్ బోట్లతో డ్రెడ్జింగ్ చేయడం వల్ల నేతలకు ముడుపులు ఇచ్చేసినా బాగానే దోచుకోవడం గమనార్హం. ఈనేపథ్యంలో బోట్స్‌మన్ సొసైటీలన్నీ కుమ్మక్కయిపోయి.. డ్రెడ్జింగ్ చేసే వారితో చేతులు కలిపి, తలో కొంత పంచుకోవడం గమనార్హం.

● మెకనైజ్డ్ రీచ్‌లతో ధర తగ్గేనా?

ఇటీవల ఇసుక బాగా అందుబాటులోకి వచ్చింది. అంతేకాక గత వైసీపీ ప్రభుత్వం నాటితో పోల్చుకుంటే బాగా ధర తగ్గినట్టే చెప్పవచ్చు. 25 టన్నుల ఇసుక గతంలో సుమారు రూ.21 వేలకు వినియోగదారుడికి అందితే, ఇవాళ సుమారు రూ.13 వేలకే వచ్చేస్తోంది. జిల్లా యంత్రాంగం ఇటీవల 10 సెమీ మెకనైజ్డ్ రీచ్‌లకు అనుమతి ఇచ్చింది. జిల్లాలోనే అంటే ర్యాంపులలో విక్రయించడానికి ఐదు సెమీమెకనైజ్డ్ బోట్లకు టెండర్లు పిలవగా అందులో నాల్గింటిని ఎంపిక చేసింది. ప్రక్కిలంకలో 7,05,000 టన్నుల ఇసుక సామర్థ్యంతో ఎనర్జియో ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఫైనల్ చేసింది. చిడిపి ర్యాంపులో 7,24, 500 టన్నుల సామర్థ్యంతో గాలి సుబ్బరాజు కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇచ్చింది. అరికిరేవుల ర్యాంపును 8,71,500 టన్నుల సామర్థ్యంతో ఇసుక తీసుకునే విధంగా కేవీవీఎస్ఎన్ ఇన్‌ఫ్రా (ఇండియా) లిమిటెడ్‌కు ఇచ్చింది. పురుషోత్తపల్లి ర్యాంపులో 1,05,000 టన్నుల సామర్థ్యంతో శ్రీసాయి బాలాజీ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చింది. ఈ నాలుగు ర్యాంపుల ద్వారా మొత్తం 24 లక్షల, 6 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తీయనున్నారు. సుమారుగా వారం రోజుల్లో ఈ ర్యాంపులు ప్రారంభం అవుతాయి. ఇక్కడ మెకనైజ్డ్ బోట్లతో ఇసుక తీస్తారు అంటే డ్రెడ్జింగ్‌కు అనుమతి ఇచ్చినట్టు. దీంతో ఎక్కువ ఇసుక వస్తుంది. ఈ సంస్థలన్నీ టన్ను ఇసుకను రూ.35కే తీస్తామని టెండర్లు వేయడం గమనార్హం. దీనితో ఇసుక ధర మరికొంత తగ్గడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక విధానం రానున్న రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలను కూడా ఇవ్వవచ్చు. పెండ్యాల ర్యాంపు నుంచి పశ్చిమగోదావరికి జిల్లాకు 4 లక్షల 62వేల టన్నుల ఇసుక, కుమారదేవం ర్యాంపు నుంచి విశాఖపట్నానికి 8 లక్షల 85వేల టన్నుల ఇసుక, తాడిపూడి నుంచి ఏలూరు జిల్లాకు 7,39,950 టన్నుల ఇసుక, సింగవరం నుంచి అనకాపల్లికి 5 లక్షల 16 వేల టన్నుల ఇసుక, కాటవరం ర్యాంపు నుంచి కాకినాడకు 3,46,500 మెట్రిక్ టన్నుల ఇసుక సెమీమెకనైజ్డ్ విధానంలో తీసేటట్టు నిర్ణయం తీసుకున్నారు.

ఆహ్లాదం..



భారీ వృక్షాలతో నిండిన రాయనపేట - వెంకటరెడ్డిపేట రహదారి ఏటపాక (ఆంధ్రజ్యోతి)



పచ్చటి చెట్లతో ఆహ్లాదకరంగా మారిన సామర్లకోట - కాకినాడ ప్రధాన రోడ్డు సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

వేమగిరిలో... 84 అడుగుల బుద్ధ విగ్రహం ప్రారంభం



వేమగిరిలో బుద్ధ విగ్రహాన్ని ప్రారంభించి ధర్మహాలును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల



కడియం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అనేక దేశాల్లో బౌద్ధ మతం ఉందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా వేమగిరి బుద్ధవిహార్‌లో మహోదయ యాజరా ఏర్పాటు చేసిన 84 అడుగుల బుద్ధ విగ్రహాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ధర్మహాలు, వాటిలోని వివిధ రచయితల పుస్తకాలను పరిశీలించారు. పచ్చని నర్సరీల ప్రాంతంలో బుద్ధ విహార్ కేంద్రం ఏర్పాటు చేసిన యాజరాను గోరంట్ల అభినందించారు. బుద్ధవిహార్ అభివృద్ధికి రూ.25 వేలు ఇస్తున్నట్టు ప్రకటించారు. చైనా, జపాన్, కంబోడియా, కొరియా, చైనా వంటి దేశాల్లో విస్తరించి ఉండడంతో బౌద్ధ మతం ప్రపంచమతంగా ఉందన్నారు. రచయిత గౌరవ్ రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. యాజరా బౌద్ధమతం గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గోరంట్లను సత్కరించారు. కార్యక్రమంలో పేరవరం పిరమిడ్ ధ్యానకేంద్రం ట్రస్ట్ అధ్యక్షుడు సీఎస్ మూర్తి, టీడీపీ రాష్ట్ర నాయకుడు మార్గాని సత్యనారాయణ, కోలా వెంకట్రాజు(కేవీఆర్), అక్కిన ఆనందబాబు, చందన నాగేశ్వర్, షేక్ మీరావలి, బీజేపీ మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, దాసరి ముత్యం తదితరులున్నారు.

అప్పు తీర్చమన్నందుకు.. అతి కిరాతకం!

దొమ్మేరు హత్య కేసులో వీడిన మిస్టరీ, ముగ్గురి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమన్నందుకు పథకం ప్రకారం వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్య చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే..

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన పెండ్యాల ప్రభాకరరావు వేస్టేజి కంపెనీ ఉత్పత్తుల ఏజెంట్ల ద్వారా విక్రయిస్తుంటాడు. పోలవరం మండలం పాత పట్టిసంకు చెందిన చుక్కా రామ శ్రీనివాస్ తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామ సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌లు, విలాసాలకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. ఇద్దరికీ గత కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. దీంతో 2024 డిసెంబర్‌లో ప్రభాకరరావు వద్ద శ్రీనివాస్ రూ.2,40,000 అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని ప్రభాకరరావు పదే పదే అడిగేవాడు. అతడి చంపేస్తే బాకీ తీర్చనవసరం లేదు, ఒంటిపై ఉన్న బంగారపు వస్తువులు అమ్ముకుని ఇతర బాకీలు తీర్చుకోవచ్చని శ్రీనివాస్ నిర్ణయించుకున్నాడు.

పథకం ప్రకారం రప్పించి...

దీంతో దొండపూడి గ్రామానికి చెందిన అంకోలు జగదీశ్ దుర్గాప్రసాద్, పోలవరానికి చెందిన నోముల ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పథకం వేశాడు. 2025 మార్చి 26న రాత్రి 8 గంటలకు ప్రభాకరరావుకు ఫోన్ చేసి బయటకు రప్పించాడు. యాక్టివా మోటారుసైకిల్‌పై ప్రభాకరరావు, శ్రీనివాస్ దొమ్మేరు పుంతలోని నీరుకొండ శేషగిరిరావు డ్రాగన్‌ఫ్రూట్ తోటలోకి వెళ్లారు. ప్రభాకరరావును శ్రీనివాస్ కత్తితో వెనుక నుంచి తలపై, వీపుపై పలుమార్లు దాడి చేశాడు. కిందపడిన తరువాత కంఠంపై నరికివేసి కిరాతకంగా హతమార్చాడు. తరువాత మెడలో ఉన్న బంగారపు గొలుసు, ఎడమచేతికి ఉన్న ఉంగరం తీసుకున్నాడు. కుడి చేతికి ఉన్న బంగారపు కడి యం, 3 ఉంగరాలు తీయబోగా రాకపోవడంతో కుడిచేతి గుత్తిని నరికి చేతిని పేపర్లో చుట్టుకుని, చెయ్యి, హత్యకు ఉపయోగించిన కత్తి, దొంగిలించిన బంగారపు గొలుసు, ఉంగరం సెల్‌ఫోను బ్యాగులో పెట్టుకున్నాడు. దుర్గాప్రసాద్‌ను రమ్మని ఫోన్ చేసి దొమ్మేరు, కాపవరం మీదుగా పోలవరం ఇంటికి వెళ్లిపోయారు. పోలవరంలో నో ముల ప్రవీణ్‌కుమార్‌కు విషయం చెప్పి, ము గ్గురు కలిసి నరికిన చెయ్యికి ఉన్న కడియం, 4 ఉంగరాలను తీసుకున్నారు. చెయ్యిని, కత్తిని, మృతుడు సెల్‌ఫోన్‌ని, హత్య చేసినప్పుడు శ్రీనివాస్ ధరించిన దుస్తులు, బ్యాగుని గూటాల గ్రామంలో గోదావరి నదిలోకి విసిరివేశారు. దొంగిలించిన బంగారం వస్తువులను కొయ్యలగూడెం, తాళ్లపూడి మండలాల్లో తాకట్టుపెట్టి ముగ్గురు పరారయ్యారు. మృతుడి భార్య పెం డ్యాల అనంతలక్ష్మి అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.విశ్వం కేసు నమోదు చేశారు.

కేసును ఛేదించిన కొవ్వూరు పోలీసులు

విచారణ అనంతరం ఈనెల 12న హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను సీఐ విశ్వం అరెస్టు చేశారని డీఎస్పీ తెలిపారు. రామ శ్రీనివాస్ నుంచి 31.8 గ్రాముల బంగారపు గొలుసు, 4.9 గ్రాముల ఉంగరం, నేరానికి ఉపయోగించిన హోండా ఎస్‌పి మోటారు సైకిల్, 2 సెల్‌ఫోన్లు, జగదీశ్ దుర్గాప్రసాద్ నుంచి నేరానికి ఉపయోగించిన టీవీఎస్ రైడర్ మోటారుసైకిల్, సెల్‌ఫోను, ప్రభాకరరావు నుంచి సెల్‌ఫోను, గూటాల వద్ద గోదావరిలో పడవేసిన హత్యకు ఉపయోగించిన కత్తిని, మృతుడి సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. కేసు ఛేదించినందుకు కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, ఎస్‌ఐలు పి.రవీంద్ర, కె.శ్రీహరిరావు, కె.జగన్మోహనరావు, సిబ్బందికి డీఎస్పీ రివార్డులను అందజేశారు.



వారెవ్వా అనేలా.. పెరట్లో అరటిగెల..

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం పెదపేటలో పల్లికొండ రాధా ఇంటి పెరట్లో అరటిగెల అబ్బురపరుస్తుంది. బూడిద అరటిరకం చెట్టుకు 22 అస్తాలతో గెల పెరిగింది. ఒక అస్తానికి 22 కాయలు కాశాయి.

- ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి)

‘లోవ’లో వార్షిక జాతర ప్రారంభం



జాతరను ప్రారంభిస్తున్న దృశ్యం

తుని రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మ వార్షిక జాతర వేడుకలు ఆదివారం ప్రాంభమయ్యాయి. అమ్మవారి ప్రతిరూపంగా పూజించే గరగలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భాజాభజంత్రీలు, గరగల నృత్యాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, ఆలయ ఈవో విశ్వనాధరాజు అమ్మవారి గరగలు శిరస్సున ధరించి ఉత్సవాలను ప్రారంభించారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈనెల 27న లోవకొత్తూరు గ్రామంలో గంధ అమావాస్య వేడుకను దేవదయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

రూ.5.8 లక్షల ఆదాయం

లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.5.8 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో తెలిపారు.

కొంతమూరులో నెమళ్లు

కుక్కల బారి నుంచి కాపాడిన స్థానికులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జనావాసాల్లో రెండు నెమళ్ల సందడి చేశాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కొంతమూరు శేషాద్రి హిల్స్ ప్రాంతంలో ఆదివారం ఒక నెమలిని కుక్కలు తరుముండగా స్థానికులు కాపాడి రాజమండ్రి ఫారెస్ట్ రేంజర్ దావీద్‌రాజుకు అప్పగించారు. తర్వాత మరో నెమలిని స్థానికులు తీసుకొచ్చి అప్పగించారు. ఇవి రెండూ ఆడ నెమళ్లు. వివరాలిలా ఉన్నాయి. కొంతమూరు శేషాద్రి హిల్స్ సమీపంలో ఆదివారం ఉదయం ఒక నెమలిని కుక్కలు తరుముతున్నాయని చెప్పి, ఇక్కడి నివాసి అయిన కేవీ మాధవరావు, కుటుంబ సభ్యులు అనంతలక్ష్మి, సాత్విక్ దత్తు దానిని స్థానికుల సహాయంతో కాపాడి రేంజ్ ఆఫీసర్‌కు ఇచ్చారు. కొందరు స్థానికులు మరో నెమలిని తెచ్చి ఇచ్చారు. దానికి కాలికి వేళ్లు వంకరగా ఉన్నాయి. పుట్టుకతోనే అలా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి. ఎవరైనా తీసుకొచ్చారా? ఈ ప్రాంతంలోనే ఉంటున్నాయా? అనే కోణం నుంచి ఆరా తీస్తున్నట్టు దావీద్‌రాజ్ తెలిపారు. వీటికి ఏవిధమైన గాయాలు కాలేదని, సోమవారం వైద్యుడితో పరీక్షలు చేయించి ఉన్నతాధికారుల సలహాతో ఫారెస్ట్‌లో వదిలేయడం లేదా, జూపార్కుకు ఇవ్వడం విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం క్షేమంగా అటవీ అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. వీటి వయస్సు మూడేళ్ల నుంచి 4 ఏళ్లలోపు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.



కుక్కల బారి నుంచి కాపాడి నెమలిని అధికారికి అప్పగిస్తున్న స్థానికులు



కాలి వేళ్లు వంకర ఉన్న నెమలిని ఫారెస్ట్ రేంజర్‌కు అప్పగిస్తున్న స్థానికులు

‘జగన్ రూపంలో రాష్ట్రానికి పొంచి ఉన్న ప్రమాదం’

అమలాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి అతిపెద్ద ప్రమాదం, ఉపద్రవం వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రూపంలో పొంచి ఉందని ఇంటిలిజెన్స్ చీఫ్ విశ్రాంత అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంకలోని జనిపల్లి శ్రీనివాసరావు అలియాస్ కోడికత్తుల శ్రీను సహా ఆయన కుటుంబాన్ని ఆదివారం వెంకటేశ్వరరావు కలిశారు. వారితో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ శ్రీను కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటానన్నారు. అనంతరం అమలాపురంలోని దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించిన తర్వాత ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. నాకేదైనా సమాచారం ఇవ్వాలన్నా, ముఖ్యమైన మెసేజ్ చేయలన్నా, వాట్సాప్ నెంబరు 7816020048కు మెస్సేజ్ చేయవచ్చు' అని ప్రజలకు పిలుపునిచ్చారు. కోడి కత్తి శ్రీను కుటుంబానికి అన్నివిధాలా సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



విలేకర్లతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఉత్కంఠభరితంగా..

వెలుగుబందలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బండి పరుగు పోటీలు

ప్రథమస్థానంలో అనకాపల్లి ద్వితీయస్థానం సొంతం చేసుకున్న కోనసీమ



పోటీల్లో పాల్గొన్న ఎడ్ల బండి

రాజానగరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబందలో గ్రామదేవత శ్రీసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కూటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండి రౌండ్ పరుగు పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్ పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 23 జతల ఎడ్ల బండ్లు సత్తా చాటాయి. జిల్లాలోనే తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీల్లో అనకాపల్లి జిల్లా లెక్కలవానిపాలేనికి చెందిన పెద పైడితల్లమ్మ(సత్తిబాబు) ఎడ్ల బండి ప్రథమస్థానం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల తేజా చౌదరికి చెందిన ఎడ్ల బండి ద్వితీయస్థానం, విజయనగరం జిల్లాకు చెందిన కె.రాము నాయుడికి చెందిన ఎడ్ల బండి తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే విజయనగరం జిల్లా వావిలిపాడుకు చెందిన మరిడి మాంబకు చెందిన ఎడ్ల బండి నాల్గోస్థానం, అనకాపల్లి జిల్లా అర్జునగిరి గ్రామానికి చెందిన పరవాడ నాయుడుకు చెందిన ఎడ్ల బండి ఐదో స్థానం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల తేజాచౌదరి ఎడ్ల బండి ఆరో స్థానం, అనకాపల్లి జిల్లా రేవళ్లకు చెందిన పంచాడ వెంకటరావుకు చెందిన ఎడ్ల బండి ఏడో స్థానం, అనకాపల్లి జిల్లా దేవరపల్లికి చెందిన శ్రీవీరాం జనేయకు చెందిన ఎడ్ల బండి ఎనిమిదో స్థానంలో నిలిచాయి. న్యాయ నిర్ణేతగా మజ్జి దేవానంద్ వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బహుమతి ప్రదానం చేశారు.



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

నూకాలమ్మ ఆలయానికి రూ.11లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మలికిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లిలో నూకాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి లక్కవరానికి చెందిన ముదునూరి సుబ్బరాజు-లక్ష్మీనర్సాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ముదునూరి సత్యసూర్యసీతారామరాజు, ముదునూరి వెంకటసుబ్బరాజు, ముదునూరి గోపాలకృష్ణంరాజు (చినబాబు) రూ.11 లక్షల విరాళాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. నూకాలమ్మ చారిటబుల్ ట్రస్టుకు విరాళాన్ని అందించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దాతలతో పాటు సుంద్ర బ్రహ్మయ్య, కటికిరెడ్డి సత్యనారాయణ, కటికిరెడ్డి గోపాలకృష్ణ, దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మువ్వన్నెల వర్ణం!

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం జాతీయ పతాకాన్ని తాకతున్నట్టు ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది.

- గండేపల్లి (ఆంధ్రజ్యోతి)

శ్రీవారికి శ్రీపుష్పోత్సవం

ముగిసిన వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి శ్రీపుష్పోత్సవం వేడుకగా నిర్వహించారు. విద్యుత్, ఫలపుష్ప అలంకరణ సాంస్కృతిక ప్రదర్శనలు, కళాకారుల వాయిద్యాలు, భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం స్వామివారికి మేలుకొలుపు, నిత్యార్చన, నిత్యహోమాలు, దిగ్దేవత బలిహరణ, ద్రవిడ వేదపారాయణం, నిరాజన మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ద్వాదశ ప్రదక్షిణలు, ఫలప్రసాద నివేదన, ముఖమండపంలోని స్వామివారి అద్దాల మేడలో శ్రీపుష్పోత్సవం కనుల పండుగగా జరిగింది. ఫలపుష్పాలతో అలంకరించిన ఊయ్యాలలో స్వామివారి ఏకాంత సేవ జరిగింది. ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. అశేషభక్తజనం కల్యాణోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వామివారికి ఏకాంత సేవ నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారికి ఫలప్రసాద నివేదన

సీతారాములకు శ్రీపుష్పయోగం

అన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రపాలకులైన సీతారాముల దివ్యకల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రి శ్రీపుష్పయోగంతో ముగిసాయి. రాత్రి 8 గంటలకు నవదంపతులైన సీతారాములను, పెళ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లను వేర్వేరు వేదికలపై ఆశీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం నవ దంపతులకు వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో ఆశీనులు గావించి పుష్పార్చన చేశారు. వివిధ రకాలైన మధురఫలాలు, తీపి పదార్థాలను నివేదించారు. కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీతాంబూలాలు అందజేశారు. ఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో ఊగుటూయలలో సీతారాములు

పేకాడుతున్న పది మంది అరెస్టు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో శనివారం ఇంద్రపాలెం, కోరింగ, గొల్లపాలెం ఎస్‌ఐల ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఒక గదిలో పేకాటడుతున్న పది మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రదేశంలో లభించిన రూ.42,750, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు ఇంద్రపాలెం ఎస్‌ఐ సూర్యకుమార్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఇంటి కాంపౌండ్‌లో పేకాట ఆడుతుండటం విశేషం. మాజీ ఎమ్మెల్యే స్థానికంగా నివాసం ఉండకపోవడంతో కొంతమంది దీనిని పేకాట శిబిరంగా మార్చినట్టు స్థానికులు చెప్తున్నారు.

గాలివాన బీభత్సం

ఊలపల్లిలో నేలకొరిగిన నాలుగు విద్యుత్ స్తంభాలు


ఊలపల్లిలో విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న సిబ్బంది

బిక్కవోలు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలంలో శనివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో పలుచోట్ల ఈదురు గాలులకు చెట్లు పడిపోయి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. రంగాపురం, ఇళ్లపల్లి గ్రామాల్లోని మామిడి చెట్ల కాయలన్నీ నేలరాలాయి. ఊలపల్లిలో నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రాత్రి 10 గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ స్తంభాలను ఆదివారం బిక్కవోలు ఏఈ కె.బుజ్జిదొర సిబ్బందితో సరిచేయించారు. దీంతో తమ శాఖకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని తెలిపారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొననున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈనెల 14న జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఉదయం 8.30 గంటలకు రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ సెంటర్లోని జిల్లా బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తారు. అనంతరం గోకవరం బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తారు. ఆ తర్వాత కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలసి అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. కొవ్వూరు నియోజకవర్గంలో బీజేపీ క్రియాశీల కార్యవర్గ సభ్యుల సమావేశానికి హాజరవుతారు. సాయంత్రం 3 గంటలకు రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ క్రియాశీలక కార్యవర్గ సభ్యుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో ఎడ్యుసమ్మిట్ కార్యక్రమానికి ఎంపీ పురందేశ్వరి హాజరవుతారని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నాదస్వర విద్వాన్ సాయిబాబా అస్తమయం


సాయిబాబా(ఫైల్)

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాదస్వర విద్వాంసుడు పెద్దేహపు సాయిబాబా ఆదివారం ఉదయం హఠాన్మరణం చెందారు. మర్తిపాటి మీరా సాహెబ్ శిష్యుల్లో అగ్రగణ్యుడైన సాయిబాబా తన గురువు బాణీని నాలుగు దశాబ్దాల పాటు తెలుగు నాట సుదీర్ఘం వినిపించారు. కొన్ని వేల కచేరీలు చేసి, ఎన్నో సత్కారాలు పొందిన సాయిబాబా గత ఏడాది ప్రపంచ తెలుగు మహాసభల్లో విశిష్ట పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని కొన్ని వందల కుటుంబాలకు సాయిబాబా నాదస్వరం ఓ సెంటిమెంటు. ఆయన సన్నాయి మోగించకుండా ఉత్సవాలు, శుభకార్యాలు ఉండేవి కాదనడంలో అతిశయోక్తి లేదు. ఆయన భౌతిక కాయానికి పట్ల త్యాగరాజ నారాయణదాస సమితి కార్యదర్శి వక్కలంక శ్రీరామచంద్రం, వీఎస్ఎస్ కృష్ణకుమార్, పలువురు కళాకారులు నివాళులర్పించారు.

22న జగ్గంపేటలో శాంతి ర్యాలీ

విజయవంతం చేయండి.. ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజబాబు


సింగంపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజబాబు

రంగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సోషలిస్ట్ రాజ్య నిర్మాత, మార్కిస్ట్ మహోపాధ్యాయుడు వీఐ లెనిన్ జయంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 22న జగ్గంపేటలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా జరిగే శాంతి ర్యాలీ, సభను జయప్రదం చేయాలని ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని సింగంపల్లిలో చంద్ర పుల్లారెడ్డి నగర్‌లో లెనిన్ జయంతి కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అడవులను, అడవి గర్భంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలనే లక్ష్యంతో మధ్య భారత అడవుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలపై దాడులు నిర్వహిస్తూ మారణహోమాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా జగ్గంపేటలో శాంతి ర్యాలీ, సభను ఏపీ రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యు(స్త్రీవిముక్తి)తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రజాస్వామిక వాదులు, కార్మికులు, కష్ట జీవులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెక్కా సత్తిబాబు, తలుపులమ్మ, రత్నం, పద్మ గ్రామస్థులు పాల్గొన్నారు.

'విద్యార్థులు-చదువు'పై అవగాహన సదస్సు


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసు, డాక్టర్ హిప్నో పద్మ

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ హిప్నో కమలాకర్ ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు-చదువు అంశంపై అవగాహన సదస్సును వై-జంక్షన్‌లోని ప్రభుత్వ బీసీ కాలేజి బాలుర వసతి గృహంలో నిర్వహించారు. హిప్నో కమలాకర్ జయంతి జరిపి విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం వారికి ఎమ్మెల్యే పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ పాలపర్తి శ్రీనివాస్, కె.రాజేష్, దేవి ప్రసన్న, హాస్టల్ చీఫ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత ఆత్మకూరు రామకృష్ణకు సత్కారం


రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారుడు వరదా వెంకటరత్నం జీవితంపై వెలువరించిన ఆంధ్ర చిత్రకళా సంరక్షకుడు పుస్తకంపై జరిగిన సమీక్షలో రచయిత ఆత్మకూరు రామకృష్ణకు సన్మానం జరిగింది. ఆదివారం దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన సభకు సీపీ బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి అధ్యక్షత వహించారు. ఆంధ్ర చిత్రకళా సంరక్షకుడు వరదా వెంకటరత్నంపై 16మంది శిష్యులు రాసిన వ్యాసాలతో వెలువడిన పుస్తకం, ఆయన వాస్తవ జీవన ప్రక్రియను ప్రతిబింబిస్తోందని చిత్రకారిణి ఎన్‌వీపీఎస్ లక్ష్మి తన సమీక్షలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా రామకృష్ణ రచనా ప్రతిభను సన్నిధానం ప్రశంసించారు. కార్యక్రమంలో చిత్రకారులు ఎన్ఎస్ శర్మ, పీఎస్ ఆచారి, తారా నగేష్, బి.శ్రీనివాస్, పి.రవికాంత్, బెజవాడ రంగారావు, విద్యాధరి పాల్గొన్నారు.

శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి


సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అనపర్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇరవై మూడు సంవత్సరాలుగా స్వామి వివేకానందుని స్ఫూర్తితో రామకృష్ణ సేవా సమితి ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో బాటు స్వామి వివేకానందుని భావజాలాన్ని వ్యాప్తింపజేసేందుకు కృషి చేస్తున్నారు. ఆదివారం స్థానిక కోళ్ల రైతుల సంక్షేమ సంఘం కళ్యాణ మండపంలో జరిగిన సమితి సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా సుబ్బారెడ్డిని తొమ్మిదో సారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, రాజమండ్రి రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ తదితరులు అభినందించారు. సమావేశంలో సమితి ప్రతినిధి ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశజనక ఫలితాలు

- గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష ఫలితాల పరిస్థితి
- ఆందోళనలో తల్లిదండ్రులు


ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు(ఫైల్)

గోకవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యాప్రమాణాలు రోజురోజుకూ మరింత దిగజారుతున్నాయి. ఈనెల 12న విడుదలైన ఇంటర్ ఫలితాలను పరిశీలిస్తే ఇదే నిజమే అని అనిపించకమానదు. ద్వితీయ సంవత్సరానికి చెందిన 158 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 92 మంది(58.22)మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 66 మంది ఫెయిలై నిరుత్సాహ పరిచారు. ఇక ప్రథమ సంవత్సరం ఫలితాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. మొత్తం 214మంది విద్యార్థులకు గాను పరీక్షకు 204మంది హాజరవ్వగా 63మంది విద్యార్థులు(30.3శాతం) మాత్రమే పాసయ్యారు. మిగిలిన 151 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. దీనిని బట్టి స్థానిక ఇక్కడి జూనియర్ కళా శాలలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

భిన్న అభిప్రాయాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జూనియర్ కళాశాలలపై దృష్టి సారించింది. పాఠ్య పుస్తకాలతో పాటు, మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పించింది. అయితే ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బోధన సరిగా జరగకపోవడమే ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువవ్వడం. విద్యార్థుల స్థాయిని అంచనా వేసి అందుకనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాల వల్లే ఇంత దారుణమైన ఫలితాలు రావడానికి కారణమని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్త పరుస్తున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులే ఎక్కువ

గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 11 మంది అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరిలో ఐదుగురు రెగ్యులర్ కాగా, మిగిలిన ఆరుగురు కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్నవారే. పూర్తి స్థాయి అధ్యాపకులు తక్కువగా ఉండడం, కాంట్రాక్టు అధ్యాపకులపైనే ఎక్కువగా ఆధారపడి తరగతులను నిర్వహించడం జరుగుతోంది. దీంతో విద్యార్థులపై ఎవ్వరికీ సరైన పట్టు లేకుండాపోయింది. వచ్చామా! బోధించామా! వెళ్లామా! అనే రీతిలోనే ఇక్కడ తరగతుల నిర్వహణ ఉందనే విమర్శలు ఉన్నాయి. దీనివల్లే ఈ కళాశాలలో విద్యాప్రమాణాలు రోజురోజుకు దిగజారుతున్నాయనే ఆరోపణలు ఇటీవల గట్టిగా వినిపిస్తున్నాయి.

కోట సత్తెమ్మకు పూజలు



నిడదవోలు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి సుప్రభాత సేవ ధూపహారతి, నిత్యార్చనా, లలితాపారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. ఈ సందర్భంగా ఆదివారం ఒక్కరోజే అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఇతర టిక్కెట్ల విక్రయాలు ద్వారా మొత్తం రూ.1,75,164 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం

అమ్మవారి ఆలయంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మజ్జిగ చలివేంద్రానికి కొత్త త్రిమూర్తులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కొత్తతులసి రామకృష్ణ 100లీటర్ల పెరుగును దేవస్థానానికి అందజేశారు.

అంబేడ్కర్‌పై కవితాగానం

- కళాగౌతమి రచయితల సమావేశంలో ఇద్దరు ప్రముఖులకు సత్కారం


సాహితీవేత్త అరిపిరాల నారాయణరావు, బహుముఖ ప్రజ్ఞాశాలి తాతా సందీప్‌శర్మలను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరంలోని కందుకూరి వీరేశలింగం పురమందిరంలో నిర్వహించిన కళాగౌతమి రచయితల సమావేశంలో అంబేడ్కర్ జీవిత విశేషాలను తెలియజేస్తూ పలువురు కవులు చక్కటి కవితాగానం చేశారు. 'ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ అంబేడ్కర్' అనే అంశంపై జరిగిన ఈ కవితాగానంలో కవులు మల్లెమొగ్గల గోపాలరావు, వీవీ సుబ్రహ్మణ్యం, జో.రా శర్మ, ఎం.సూర్యనారాయణ, ఓబులేశు తదితరులు అంబేడ్కర్ గొప్పదనాన్ని, ఆయన ఆశయాలు, ఆలోచనాధోరణి, సాధించిన విజయాలను, రాజ్యాంగ నిర్మాతగా ఆయన ఎదిగిన తీరును కవితాగానంతో ఆసక్తిగా తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా సత్కారం పొందిన ప్రముఖ సాహితీవేత్త, రచయిత అరిపిరాల నారాయణరావు, ఎన్నో ప్రవచనాలు, అనేక బిరుదులు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి తాతా సందీప్‌శర్మలను సత్కరించారు. కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి, అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు, కవి వై.మోహనరావు చేతులమీదుగా ఈ సత్కార కార్యక్రమం జరిగింది. కళాగౌతమి కార్యదర్శి బీహెచ్‌వీ రమాదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కవి ఓబులేశు వందన సమర్పణ చేశారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద దీపోత్సవం


అంబేడ్కర్ విగ్రహం వద్ద దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాల వద్ద దీపాలను వెలిగించి నివాళులర్పించాలని బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం రాత్రి రంగంపేటలో కూటమి నాయకులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరచి, దీపాలను వెలిగించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని, ఆశయాలను, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏవిధంగా ఆదరణ ఇచ్చిందో, ప్రస్తుతం బీజేపీ ఏవిధంగా ఆదరణ ఇస్తుందో ప్రజలకు చూపించడం కోసమే బీజేపీ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు ఎలుగుబంటి సత్తిబాబు, షైలవరపు సాయిరామ్, గిరజాల సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జెండాల పంపిణీ


అంబేడ్కర్ జెండాలు పంపిణీ చేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 2వేల జెండాలను, తోరణాలను పంపిణీ చేసినట్టు అంబేడ్కర్ సేవా కేంద్రం (ఆస్క్) చైర్మన్ గుబ్బల రాంబాబు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులకు ఈ జెండాలు అందించామన్నారు. రాజమహేంద్రవరం చుట్టు పక్కల ప్రాంతాల అంబేడ్కర్ అభిమానులందరు ఈ నెల 14వ తేదీ ఉదయం అంబేడ్కర్ విగ్రహాల వద్ద జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం 3గంటలకు క్వారీ మార్కెట్ సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగే ఉత్సవ ర్యాలీని జయప్రదం చేయాలన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం


ఈత మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీని ఘనంగా నిర్వహించారు.యూదుల రాజుకు జయం జయం అంటూ క్రైస్తవ సంఘాల సభ్యులు పువ్వులతో ఆలంకరించిన ఈత మట్టలు చేత పట్టుకుని నగరంలో పురవీధుల్లో ర్యాలీ చేశారు. స్థానిక సువిశేషపురం బి క్లాస్ పేరిష్ నుంచి క్రైస్తవులు ర్యాలీ చేశారు. పేరిష్ పాస్టర్ పి.మార్టిన్ లూథర్, సంఘం ట్రెజరర్ జంగం శాంసన్, సంఘ సభ్యులు, స్త్రీలు, యూత్ ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో సెయింట్ లూక్స్ లూథరన్ సంఘం ఆధ్వర్యంలో మల్లయ్యపేట, వీవీ నగర్, సుబ్బారావు పేట ప్రాంతాల్లో జయ ప్రవేశ పండుగ ర్యాలీ చేశారు. ప్యారీస్ పాస్టర్ వరా కృపావరం, సీఆర్ జమీమా ప్రేమ్‌కుమార్, సం ఘం సభ్యులు మట్టల ఆదివారం ర్యాలీని నిర్వహించారు. రాజవోలు గ్రామంలో క్రీస్తు కృపాసంఘం పాస్టర్ పి.టాటా విక్టర్, సుగుణ విక్టర్ సంఘం పెద్దలు, యూత్ సభ్యులంతా ర్యాలీ నిర్వహించారు.

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, ఎస్టీరాజాపురం, ఈలకొలను, జి.దొంతమూరు, కోటపాడు,పెదరాయవరం, చంద్రేడు, సింగంపల్లి, నల్లమిల్లి, దొడ్డిగుంట, మర్రిపూడి, వీరంపాలెం, ముకుందవరం, సుభద్రంపేట, వెంకటాపురం గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని జరుపుకున్నారు. సండే స్కూల్ పిల్లలు పూలతో అలంకరించి మట్టలను చేతపట్టుకొని గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ జయము జయము యేసురాజు అంటూ పాటలు పాడారు.

అంబేడ్కర్ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పీస్ ఫర్ పీపుల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు లంక సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక టి.నగర్‌లో ఉన్న ఆయన క్లినిక్‌లో రోగులకు ఉచితంగా నరాలు, ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గుదే వెంకటేశ్వరరావు, శిరికి అక్కునాయుడు, తంగేటి దుర్గాప్రసాద్, చల్లగాలి వెంకట రామరాజు, పి.కోటేశ్వరరావు, డాక్టర్ కొమ్మా శ్రీనివాస్, నరవ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

టీటీడీలో గోవుల మరణాలపై అసత్య ప్రచారం

రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి



కోరుకొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుమల గోశాలలో గోవులు చనిపోయాయంటూ భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం బూరుగుపూడి టీడీపీ కార్యాలయంలో ఆయన ఒక మీడియా ప్రకటన జారీ చేశారు. భూమన అసత్య ప్రచారంతో టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. టీటీడీ గోశాలలో 260మంది గో సంరక్షణ చేస్తున్నారని, 2668 ఆవులకు జియోట్యాగ్ చేసి పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో భూమన టీటీడీ ఖజానాను దారి మళ్లించి కమీషన్లు కొట్టేశారని, తిరుమల కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించారని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీవీఆర్ డిమాండ్ చేశారు. తిరుమల గోశాలలో100కు పైగా గోవులు మరణించాయంటూ భూమన చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తల్లిలాంటి గోవుల పరిస్థితిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రతి రోజు పరిశీలిస్తున్నారన్నారు. గోశాలలో అన్ని వసతులు ఉన్నాయన్నారు. వయస్సు పైబడి, అనారోగ్యంతో చనిపోయే ఘటనలు కూడా భూతద్దంలో చూపిస్తున్నారని విమర్శించారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



కొవ్వూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 20వరకు అగ్రిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు తెలిపారు. ఆదివారం కొవ్వూరు అగ్నిమాపక శాఖ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడారు. ఫైర్ అధికారి వేణు మాట్లాడుతూ 14న అగ్ని ప్రమాదాలలో మృతి చెందిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి, వారోత్సవాల పాంప్లెట్, బ్రోచర్స్‌ని పంపిణీ చేస్తామన్నారు. 15న పట్టణ, మండలంలోని ప్రధాన కూడలిలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. 16న విద్యాసంస్థల్లోను, 17న పరిశ్రమలు, గొడౌన్‌లు, వ్యాపార సంస్థల్లోను, 18న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలోను అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 19న ప్రమాదాలు జరిగితే ముందుగా ఏం చర్యలు తీసుకోవాలో సూచించారు. 20న వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ వర్గాల ప్రజలకు అగ్నిప్రమాద నివారణ చర్యలను వివరిస్తామని తెలియజేశారు.

వ్యాన్‌ను ఢీకొన్న బైక్

యువకుడికి గాయాలు


గాయాలపాలైన సురేష్

నిడదవోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం గోపవరంవద్ద ఆదివారం రాజమహేంద్రవరం నుంచి నిడదవోలు వైపు వస్తున్న గూడ్స్ వ్యాన్‌ను నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న మోటారు సైకిలిస్టు సురేష్ ఢీకొనడంతో మోటారు సైకి లిస్టుకు గాయాలయ్యాయి. గాయాల పాలైన రాజమహేంద్రవరానికి చెందిన యువకుడు బి.సురేష్‌గా గుర్తించి స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108లో గాయపడిన సురేష్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనూషకు కేంబ్రిడ్జి యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్


వర్శిటీ అధికారుల నుంచి గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న అనూష

అనపర్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనపర్తికి చెందిన కర్రి రూప అనూష ఢిల్లీలోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐటీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా చేస్తున్న అనూష టీచింగ్ విభాగంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను అనపర్తి ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్, రాజమహేంద్రవరంలోని ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో డిగ్రీ, విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి నట్టు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో హెచ్ఐటీఎస్ కళాశాలలో లెక్చరర్‌గా చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా అనూషను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రముఖులు అభినందించారు.

స్పోర్ట్స్ హబ్‌గా రాజమహేంద్రి: ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13(ఆం ధ్రజ్యోతి): స్పోర్ట్స్ హబ్‌గా రాజమహేంద్రవరాన్ని తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక మున్సిపల్ స్టేడియంలో ఆదిరెడ్డి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విన్నర్, రన్నర్ జట్లకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియం నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని చెప్పారు. వీఎల్‌పురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 14 ఏప్రిల్ 2025 | 5


మారేడుమిల్లిలో రోడ్డుపై కూలిన చెట్టు


రాజమహేంద్రవరంలో మెరుపులు



పిఠాపురంలో భారీ వర్షం..


యు.కొత్తపల్లి మండలంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం

ఈదురుగాలుల బీభత్సం

- 'తూర్పు'లో భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు
- తెగిపడిన విద్యుత్ తీగలు
- గ్రామాల్లో అంధకారం
- తడిచిపోయిన ధాన్యం

కాకినాడ/పిఠాపురం/గొల్లప్రోలు/కొత్తపల్లి/ రాజమహేంద్రవరం సిటీ - ఆంధ్రజ్యోతి): జిల్లాలో గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉదయమంతా ఎండ కాచి ఉక్కబోయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాత్రికి పెనుగాలులు వీచాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కరెంటు స్తంభాలు సైతం కూలిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో అంధకారం అలుముకుంది. గాలుల తాకిడికి రహదారులపై ఇసుక, దుమ్ము సైతం లేచింది. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలతోపాటు ఏజెన్సీ ప్రాంతంలో కూడా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాత్రి 9 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. హోరుగాలితో జనం హడలెత్తిపోయారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కొత్తపల్లి, ప్రత్తిపాడు మండలాల్లోను, కోనసీమ జిల్లాలోని అమలాపురం, అంబాజీపేట, పి.గన్నవరం, కె.గంగవరం తదితర చోట్ల, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంతోపాటు చుట్టుపక్కల మండలాల్లోను భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి విద్యుత్‌స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. తోటల్లో మామిడికాయలు నేలరాలిపోయాయి. ధాన్యం రాశులు తడిచిపోయాయి. నువ్వులు, అపరాలు, ఇతర మెట్ట పంటలు దెబ్బతిన్నాయి. కాకినాడ మెయిన్‌రోడ్డులోను ఓ భారీ వృక్షం నేలకూలింది. రామారావుపేట పాము వారి వీధిలో కరెంటు తీగలపై చెట్టు పడింది. గొల్లప్రోలు-తాటిపర్తి, గొల్లప్రోలు-చెందుర్తి ఆర్‌అండ్‌బీ రోడ్లతోపాటు పలు ప్రధాన రహదారులపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలు నిలిపివేశారు. 50 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలులకు కొత్తపల్లి మండలం ఉప్పాడలో కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఊరిలోనే.. ఉపాధి!

- యువతకు వర్క్‌ఫ్రం హోం
- కూటమి ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్
- సాఫ్ట్‌వేర్‌పైనే ప్రధాన దృష్టి
- ఇంట్లోనే పనిచేసుకునేలా సౌకర్యాల కల్పన
- లేదంటే వర్క్‌ఫ్రం హోం సెంటర్‌కి వెళ్లొచ్చు
- ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు
- ఇప్పటికే పూర్తయిన సర్వే
- పని ఉన్నవారు వేలల్లో.. లేనివారు లక్షల్లో
- సర్వేలో విద్యార్హతలతో సహా తేలిన లెక్కలు
- ఇంటర్‌నెట్ కనెక్షన్ల వివరాలూ నిక్షిప్తం



సొంత ఊరిలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉద్యోగులకు, కంపెనీలకు ఉపయోగపడేలా ఇంటి నుంచే పని (వర్క్‌ఫ్రం హోం) సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తోంది. ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోం విధానం సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన కార్పొరేట్ సంస్థల్లో కొనసాగుతోంది. కొవిడ్-19 తర్వాత చాలా కంపెనీలు దీనిని కొనసాగిస్తున్నాయి. కంపెనీలకు ఈ విధానం సులభంగా ఉండడం, ఆర్థికంగా మేలు జరుగుతుండడంతో పనులు చేయించుకునేందుకు ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయి. తద్వారా ఎక్కువమందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు అనుగుణంగా వర్క్‌ఫ్రం హోంకు అనువైన కేంద్రాలను గుర్తించే పనులు చేపడుతున్నారు.

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం -ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలోనే యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తున్నాయి. అది కూడా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలతోపాటు, విదేశాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. చాలామంది అక్కడి వెళ్లిపోతున్నా.. కొంతమంది మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాలు, నగరాల్లో పనిచేసినా వచ్చే జీతంలో ఎక్కువ ఖర్చులకే అయిపోవడం, తల్లిదండ్రులు, కుటుంబాలకు దూరంగా ఉండాల్సి రావడంతో సొంతూరిలోనే ఏదొక వ్యాపారం, వ్యవసాయం, తమ చదువులకు తగ్గ చిన్న ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి ఇంటి వద్దే ఉంటూ ఐటీ కంపెనీల్లో పనిచేయడానికి వీలున్న యువతను గుర్తించే పనులు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో యువతీయువకులు, అర్హతలు వంటివి సర్వే ద్వారా సేకరించారు.

అందరివీ 'ఐటీ' కలలే..

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఏ విభాగంలో విద్యను అభ్యసించారో కూడా వివరాలు సేకరించారు. అయితే ఈ సర్వేని బట్టి దాదాపుగా అందరూ సాఫ్ట్‌వేర్‌కే ప్రాధాన్యం ఎక్కువ ఇస్తున్నారు. దీంతో తొలుతగా ఆ రంగంలోనే ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా సాఫ్ట్‌వేర్ అభ్యసించిన వాళ్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయారు. కానీ ఐటీ రంగంలో ఆ స్థాయిలో ఉద్యోగ కల్పన లేదు. ఒకవేళ ఉన్నా సుదూర ప్రాంతాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐటీ సెక్టార్‌ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మరింత దుస్థితికి దారితీసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత సాఫ్ట్‌వేర్ చదువుకున్న అభ్యర్థుల కష్టాలను గుర్తించింది. కొందరికి వర్క్‌ఫ్రంహోం సదుపాయాన్ని కంపెనీ కల్పించినా ఇంటి వద్ద సరైన సౌకర్యాలు లేవు. అధిక శాతం మందికి అసలు ఉద్యోగాలే లేవు. స్వల్ప సంఖ్యాకులకు ఉద్యోగం ఉన్నా దూర ప్రాంతాల్లో అతి తక్కువ జీతాలతో నెట్టుకురావాల్సి వస్తోంది. దూర ప్రాంతాల్లో ఇబ్బందులు పడలేక ఉద్యోగం వదిలేసి సొంతూరికి వచ్చి ఏదొక పని చేసుకుంటున్నవాళ్లూ ఉన్నారు. ఈ సమస్యలకు వర్క్‌ఫ్రం హోంతో చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. దానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ చదువరులకు వర్క్‌ఫ్రం హోం కష్టాలు తగ్గించడం, వారికి ఉద్యోగం లేకపోతే ఏదొక కంపెనీ తరఫున వర్క్‌ఫ్రం హోం సదుపాయం కల్పించడంపై కసరత్తు జరుగుతోంది. ఒక మండలంలో వివరాల ప్రకారం ఆయా ప్రదేశాల్లో ఒకచోట వర్క్‌ఫ్రం హోంకి అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తారు. అక్కడ కంప్యూటర్లు, వైఫై వంటి సదుపాయాలు ఉంటాయి. ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం సెంటర్‌కి వెళ్లి విధులు నిర్వహించుకోవచ్చు.



ఇవీ సర్వే గణాంకాలు

విద్యార్హతలు	తూర్పుగోదావరి	కాకినాడ	కోనసీమ
నిరక్షరాస్యులు	5,095	6,940	3,278
తొమ్మిదిలోపు చదువు	22,202	25,795	23,375
పదో తరగతి	32,791	38,581	39,142
ఇంటర్	36,428	47,094	45,168
డిప్లమో/ఇతరం	9,265	12,923	13,982
ఇంజనీరింగ్	18,600	22,606	23,863
కామర్స్ డిగ్రీ	8,966	9,550	9,663
ఆర్ట్స్ డిగ్రీ	8,718	10,787	10,193
డిగ్రీ ఇతర కోర్సులు	30,282	42,131	37,508
ఎంబీబీఎస్	247	302	239
బీఎల్	218	256	184
పీజీ	11,538	12,924	12,535
పీహెచ్‌డీ	194	227	258
ఇతరులు	4,944	5,991	7,311
ఉద్యోగం/ఉపాధి :			
పనిచేస్తున్నవారు	27,962	30,795	27,337
పనిచేయనివారు	1,61,493	2,05,345	2,01,573
మొత్తం :	1,89,455	2,36,140	2,28,910
బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ :			
ఉన్నవారు :	20,993	20,163	18,873
వైఫై ఫెసిలిటీ	11,511	15,034	12,153
అదనపు వైఫై సౌకర్యం	48,737	61,516	49,452

వర్క్‌ఫ్రం హోం సర్వే లక్ష్యం ఇదే

వర్క్‌ఫ్రం హోం ద్వారా పనిచేసేందుకు ముందుకు వచ్చే నిరుద్యోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి కూటమి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇంటర్నెట్, ఏసీ సదుపాయం ఉన్న భవనాలను గుర్తించే పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎంత మంది ఉన్నారు? ఉద్యోగాలు చేస్తున్నవారు ఏయే కంపెనీల్లో చేస్తున్నారు?, ఇంటి దగ్గరే ఉండి పనిచేస్తున్నారా?, ఆయా కంపెనీలకు వెళ్లి పనిచేస్తున్నారా? వర్క్‌ఫ్రం చేసేవారు ఎక్కడి నుంచి చేస్తున్నారు?, వారు పనిచేసే రూమ్ సైజ్ ఎంత?, ఆ రూమ్‌లో వేరొకరికి చోటు కల్పించే అవకాశం ఉందా?, ఇంటర్నెట్ సౌకర్యం ఉందా?, ఎంత స్పీడ్‌లో నెట్‌ను వినియోగిస్తున్నారు? వంటి వివరాలపై సర్వే నిర్వహించారు. అలాగే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు విద్యార్హతలు ఉన్న వారెందరు? ఉద్యోగాలు చేస్తున్నారా? లేదా? చేయకపోతే కారణాలు?, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలని ఎంత మందికి ఆసక్తి ఉంది? ఇలా వివరాలు సేకరించారు. వీరందరూ త్వరలోనే ఇంటి నుంచి పనిచేసుకునేలా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఎక్కడెక్కడికో సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా ఇంటిపట్టునే ఉంటే.. ఉద్యోగం చేసుకునేలా ఉపాధి చూపనుంది. ఇప్పటికే ఆయా సంస్థల ప్రతినిధులతో కూటమి సర్కారు పెద్దలు సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది.

అంబేడ్కర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయశాస్త్రవేత్తగా, సంఘ సంస్కర్తగా కీర్తించబడిన మహనీయులని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సమాజంలో కుల, మత, లింగ వివక్షణ నిర్మూలనకు, మహిళా సాధికారితకు ఆయన ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ముఖ్యంగా యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయాలకు తగినట్టుగా నడుచుకోవాలని సూచించారు. సోమవారం జరిగే అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలకు శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రశాంతంగా ఆయా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరు పోలీసు వారికి సహకరించాలని కోరారు.


గోకవరం-కొత్తపల్లి రహదారి మధ్యలో మరమ్మతుకు గురైన తొట్టె

పశువుల తొట్టెల నిర్వహణ ఇలాగేనా?

- పశువుల దాహార్తిని తీర్చలేకపోతున్న నీటి తొట్టెలు
- కొత్తవి పూర్తయ్యేదెపుడో

గోకవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. పశువులకు, పలు రకాల జీవాలకు తాగునీరు లభించడం కష్టతరంగా మారింది. గ్రామాల్లో వాటి సౌకర్యార్థం గతంలో ఏర్పాటుచేసిన నీటితొట్టెలు అలంకార ప్రాయంగా మారాయి. కొన్నిచోట్ల తొట్టెల్లో నీళ్లు ఉన్నా అవి తాగడానికి ఏ మాత్రం ఉపయోగపడనివిధంగా ఉన్నాయి. రాజమహేంద్రవరం పశు సంవర్ధక శాఖ డివిజన్ పరిధిలో చాలా తొట్టెలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. నీటి లభ్యత సరిగా లేనిచోట వాటిని నిర్మించడం, అనువైన ప్రదేశాల్లో వాటి చేపట్టకపోవడమే ఇందుకు కారణంగా పాడి రైతులు చెప్పుకొస్తున్నారు. పంచాయతీ అధికారులు కూడా తొట్టెల సంగతి అసలు పట్టించుకోవడంలేదు. వాస్తవానికి పశువుల తాగునీటి కోసం రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో కొత్తగా ఉపాధి పథకం కింద సుమారు 142 నీటితొట్టెల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ నిర్మించాలన్న వివరాలు తయారు చేయడంతోపాటు, స్థలాల ఎంపిక చేపట్టారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి సుమారు 40 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. వేసవి కాలం గడిచిపోతున్నా తొట్టెల నిర్మాణాల ప్రక్రియ ఎక్కడా కనిపించడంలేదు. గోకవరం మండలంలోని రంపయర్రంపాలెం, గోకవరం, మల్లవరం గ్రామాల్లో 17 పశువుల నీటి తొట్టెలు ఉన్నాయి. వీటిలో 10 నీటి తొట్టెలు ఉపయోగంలో ఉండగా 7 నీటి తొట్టెలు మరమ్మతుకు గురైనట్టు అధికారులు చెబుతున్నారు. కొత్తగా మరో 14 తొట్టెలను ఏర్పాటుచేయడానికి ప్రతిపాదనలు సిద్ధంచేశారు. కానీ మూడొంతుల నీటి తొట్టెలు పశువుల దాహార్తిని తీర్చలేకపోతున్నట్టు చెబుతున్నారు.

నెలాఖరు నాటికి పూర్తి చేస్తాం

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను ఈ నెలాఖరునాటికి పూర్తి చేస్తామని రాజమహేంద్రవరం పశుసంవర్ధకశాఖ డీడీ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. ఇప్పటికే తొట్టెల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామని, తొట్టెల నిర్మాణాలు పూర్తిచేసి పశువుల దాహార్తి తీరుస్తామని తెలిపారు.

పేలుడు విషాదం!

- ఉలిక్కిపడిన సామర్లకోట
- అనకాపల్లి జిల్లాలో బాణసంచా ప్రమాదం మృతుల్లో ఒకరు సామర్లకోట మండలం వేట్లపాలెం వాసి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


బాణసంచా ప్రమాదంలో మరణించిన నిర్మల (కింద) ఫైల్‌ఫొటో

సామర్లకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో ఆదివారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో ఎనిమిది మంది మృతి చెందిన ఘటన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఒక మహిళ ఈ ఘటనలో మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో ఈ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. క్షతగాత్రులు ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం ఆందోళన కలిగించింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కూలి పని కోసం సామర్లకోట మండలం వేట్లపాలెంలోని గూడపర్తికి చెందిన గొడత నిర్మల(38) అనే మహిళ కొన్నాళ్ల కిందట వెళ్లింది. బాణసంచా పేలుడు ఘటనలో ఆమె మృతి చెందిందన్న సమాచారంతో ఇక్కడ వేట్లపాలెం, హుస్సేన్‌పురం, సామర్లకోట ప్రాంతాల్లో బాణసంచా తయారీలో ఉన్న వారంతా ఉలిక్కిపడ్డారు. నిర్మల కొంతకాలం కిందట గూడపర్తి గ్రామం నుంచి మరికొందరితో కలిసి బిక్కవోలు సమీపాన కొమరిపాలెంలో బాణసంచా తయారీ పనుల నిమిత్తం అక్కడకు వెళ్లిపోయింది. అక్కడి నుంచి మరికొందరి కూలీలతో కలిసి అనకాపల్లి సమీపాన కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణసంచా తయారీ సంస్థల్లో కూలీ పనుల నిమిత్తం వెళ్లి చాలా కాలమైనట్టు వేట్లపాలేనికి చెందిన పలువురు సహచర కుటుంబీకులు తెలిపారు. నిర్మల స్వతహాగా శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మహిళ కాగా, కొన్నేళ్లుగా ఆమె వేట్లపాలెం గ్రామానికి చెందిన బుజ్జి అనే వ్యక్తితో కలిసి ఉంటున్నట్టు సమాచారం. అలాగే సామర్లకోట పెన్షన్‌లైన్‌కు చెందిన మరికొందరు వ్యక్తులు కూడా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కూలీ పనుల నిమిత్తం వెళ్లినట్టు సమాచారం. వీరిలో మరో ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు సామర్లకోట పట్టణం పెన్షన్‌లైన్‌కు చెందిన వారున్నట్టు సమాచారం రావడంతో వారి శాశ్వత చిరునామాల కోసం రెవెన్యూ సిబ్బంది ఆరా తీశారు. ఇదే ఘటనలో సామర్లకోట పట్టణం పెన్షన్‌లైన్‌కు చెందిన వేశంగి రాజు, భార్య వేశంగి సంతోష్, వేశంగి షరోణి తీవ్ర గాయాలతో విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సామర్లకోటకు చెందిన సత్తిబాబు అనే వ్యక్తి ద్వారా సమాచారం అందింది. ఈ ఘటనతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బాణసంచా తయారీ సంస్థలన్నీ అప్రమత్తం అయ్యాయి. గత దీపావళి ముందురోజు తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంతోపాటు అమలాపురం, అంతకు ముందు సామర్లకోటలోనూ బాణసంచా ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి.



ఇసుక లోడింగ్ (ఫైల్‌ఫొటో)

ఆగని ఇసుక దందా!

- జోరుగా డ్రెడ్జింగ్
- కొంతవరకూ తగ్గిన ధర
- సెమీ మెకనైజ్డ్ రీచ్‌లతో మరింత అందుబాటులోకి?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానం ఇపుడిప్పుడే సరైన దారిలో పడుతోంది. గతంలో పోల్చుకుంటే చాలావరకూ ధర కూడా అందుబాటులో ఉంది. ర్యాంపు నిర్వాహకులు, రాజకీయ నేతల స్వలాభం తగ్గితే మరింత ధర తగ్గే అవకాశం ఉంది. అయితే అఖండ గోదావరిలో రాజమహేంద్రవరం వైపు, కొవ్వూరువైపు రాత్రి వేళ డ్రెడ్జింగ్ కూడా చేస్తున్నారు. డ్రెడ్జింగ్‌తో రాత్రి ఇవాళ గోదావరి ర్యాంపులలో గుట్టలు పెట్టి, పగటిపూట ఇష్టానుసారం అమ్ముకుంటున్నారు. బోట్స్‌మన్ సొసైటీల ముసుగులో ఈ దందా సాగుతోంది. ర్యాంపుల నిర్వాహకులైన రాజకీయ నేతలకు టన్నుకు రూ.50 వంతున 20 టన్నుల ఇసుక లారీకి రూ.1000 ఇవ్వవలసి వస్తోంది. కొందరైతే లారీకి 100 నుంచి రూ.180 వరకూ డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. టన్ను వంతున తమ వాటా తమకు ఇచ్చేసి, ఓవర్‌లోడుతో వ్యాపారం చేసుకోమని కూడా కొందరు సలహా ఇస్తున్నట్టు సమాచారం. నిర్వాహకులు కూడా పడవుల మీద కాకుండా మెకనైజ్డ్ బోట్లతో డ్రెడ్జింగ్ చేయడం వల్ల నేతలకు ముడుపులు ఇచ్చేసినా బాగానే దోచుకోవడం గమనార్హం. ఈనేపథ్యంలో బోట్స్‌మన్ సొసైటీలన్నీ కుమ్మక్కయిపోయి.. డ్రెడ్జింగ్ చేసే వారితో చేతులు కలిపి, తలో కొంత పంచుకోవడం గమనార్హం.

మెకనైజ్డ్ రీచ్‌లతో ధర తగ్గేనా?

ఇటీవల ఇసుక బాగా అందుబాటులోకి వచ్చింది. అంతేకాక గత వైసీపీ ప్రభుత్వం నాటితో పోల్చుకుంటే బాగా ధర తగ్గినట్టే చెప్పవచ్చు. 25 టన్నుల ఇసుక గతంలో సుమారు రూ.21 వేలకు వినియోగదారుడికి అందితే, ఇవాళ సుమారు రూ.13 వేలకే వచ్చేస్తోంది. జిల్లా యంత్రాంగం ఇటీవల 10 సెమీ మెకనైజ్డ్ రీచ్‌లకు అనుమతి ఇచ్చింది. జిల్లాలోనే అంటే ర్యాంపులలో విక్రయించడానికి ఐదు సెమీమెకనైజ్డ్ బోట్లకు టెండర్లు పిలవగా అందులో నాల్గింటిని ఎంపిక చేసింది. ప్రక్కిలంకలో 7,05,000 టన్నుల ఇసుక సామర్థ్యంతో ఎనర్జియో ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఫైనల్ చేసింది. చిడిపి ర్యాంపులో 7,24, 500 టన్నుల సామర్థ్యంతో గాలి సుబ్బరాజు కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇచ్చింది. అరికిరేవుల ర్యాంపును 8,71,500 టన్నుల సామర్థ్యంతో ఇసుక తీసుకునే విధంగా కేవీవీఎస్ఎన్ ఇన్‌ఫ్రా (ఇండియా) లిమిటెడ్‌కు ఇచ్చింది. పురుషోత్తపల్లి ర్యాంపులో 1,05,000 టన్నుల సామర్థ్యంతో శ్రీసాయి బాలాజీ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చింది. ఈ నాలుగు ర్యాంపుల ద్వారా మొత్తం 24 లక్షల, 6 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తీయనున్నారు. సుమారుగా వారం రోజుల్లో ఈ ర్యాంపులు ప్రారంభం అవుతాయి. ఇక్కడ మెకనైజ్డ్ బోట్లతో ఇసుక తీస్తారు అంటే డ్రెడ్జింగ్‌కు అనుమతి ఇచ్చినట్టు. దీంతో ఎక్కువ ఇసుక వస్తుంది. ఈ సంస్థలన్నీ టన్ను ఇసుకను రూ.35కే తీస్తామని టెండర్లు వేయడం గమనార్హం. దీనితో ఇసుక ధర మరికొంత తగ్గడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక విధానం రానున్న రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలను కూడా ఇవ్వవచ్చు. పెండ్యాల ర్యాంపు నుంచి పశ్చిమగోదావరికి జిల్లాకు 4 లక్షల 62వేల టన్నుల ఇసుక, కుమారదేవం ర్యాంపు నుంచి విశాఖపట్నానికి 8 లక్షల 85వేల టన్నుల ఇసుక, తాడిపూడి నుంచి ఏలూరు జిల్లాకు 7,39,950 టన్నుల ఇసుక, సింగవరం నుంచి అనకాపల్లికి 5 లక్షల 16 వేల టన్నుల ఇసుక, కాటవరం ర్యాంపు నుంచి కాకినాడకు 3,46,500 మెట్రిక్ టన్నుల ఇసుక సెమీమెకనైజ్డ్ విధానంలో తీసేటట్టు నిర్ణయం తీసుకున్నారు.

కోట సత్తెమ్మ అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మ వారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీరనివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేకపూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్ర సాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భ క్తులు అమ్మవారిని పెద్దఎత్తున దర్శించుకు న్నారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.43,440లు, అన్నదాన విరాళాలద్వారా రూ.12,743లు, ప్రసాద విక్రయాలద్వారా రూ.43,425లు, పూజా టిక్కెట్లు, ఇతర టిక్కెట్ల ద్వారా రూ.75,556లు, మొత్తం రూ.1,75,164లు ఆదాయం లభించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

అమ్మవారి ఆలయంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మజ్జిగ చలివేంద్రానికి కొత్త త్రిమూర్తులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కొత్తతులసి రామకృష్ణ 100లీటర్ల పెరుగును దేవస్థానానికి అందజేశారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

● వారంరోజులపాటు అవగాహన కార్యక్రమాలు



కొవ్వూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 14 నుంచి 20వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తునట్లు కొవ్వూరు అగ్నిమాపక శాఖాధికారి ఏ.వి.ఎస్ఎన్.ఎస్ వేణు తెలిపారు. ఆదివారం కొవ్వూరు ఫైర్ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడారు. ఫైర్ అధికారి వేణు మాట్లాడుతూ వారంరోజులపాటు కొవ్వూరు పట్టణ, మండలంలో గ్యాస్ ప్రమాదాలపై అపార్ట్‌మెంటులో నివసించే ప్రజలకు అవగాహన సదస్సులు, పట్టణ ప్రధాన కూడళ్ళ, పాఠశాలలు, గ్యాస్ ఏజన్సీలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రిలో సిబ్బందికి, ప్రజలకు ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు, ప్రమాదాలలో చిక్కుకున్న వారిని రక్షించి, ప్రథమచికిత్స అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 14వ తేదీన అగ్నిప్రమాదాలలో మృతి చెందిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి, వారోత్సవాల పాంప్లేట్, బ్రోచర్స్‌ని పంపిణీ చేస్తామ న్నారు. 15న పట్టణ, మండలంలోని ప్రధాన కూడలిలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. 16న బహుళ అంతస్తుల్లో నివసిస్తున్న ప్రజలకు అవగాహన, 17న విద్యా సంస్థలలో, 18న పరిశ్రమలు, గొడౌన్‌లు, వ్యాపార సంస్థలలోను, 19న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలోను అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగితే ముందుగా ఏం చర్యలు తీసుకోవాలో సూచించారు. 20న వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ వర్గాల ప్రజలకు అగ్నిప్రమాద నివారణ చర్యలను వివరిస్తామని తెలియజేశారు.

దొమ్మేరు హత్య కేసులో వీడిన మిస్టరీ

- ముగ్గురు నిందితుల అరెస్టు
- పెద్దేవం గ్రామ సచివాలయ సర్వేయరే నిందితుడు
- అప్పుతీర్చమన్నందుకే ప్రభాకరరావుపై హత్య
- కేసు చేధించిన కొవ్వూరు పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరుపుంతలో నీరుకొండ శేషగిరిరావు డ్రాగన్ ఫ్రూట్ తోటలో జరిగిన హత్య కేసును కొవ్వూరు పోలీసులు చేధించారు. పెండ్యాల ప్రభాకరరావుపై కత్తితో దాడిచేసి హత్య చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించినట్లు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. ఆదివారం డిఎస్పీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ దేవకుమార్ మాట్లాడుతూ కొవ్వూరు పట్టణానికి చెందిన పెండ్యాల ప్రభాకరరావు వేస్టేజి కంపెనీ ఉత్పత్తుల ఏజెంట్ల ద్వారా విక్రయిస్తుంటాడు. పోలవరం మండలం పాత పట్టిసంకు చెందిన చుక్కా రామ శ్రీనివాస్ తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామ సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌లు, విలాసాలకు అలవాటు పడి అప్పులపాలయ్యాడు. ఇద్దరికీ గత కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. దీంతో 2024 డిసెంబర్ నెలలో ప్రభాకరరావువద్ద శ్రీనివాస్ రూ.2,40,000లు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని ప్రభాకర్ పదే పదే అడుగుతున్నాడు. ప్రభాకరరావును చంపేస్తే బాకీ తీర్చనవసరం లేదు, అతని ఒంటిపై ఉన్న బంగారపు వస్తువులు అమ్ముకుని ఇతర బాకీలు తీర్చుకోవచ్చునని నిర్ణయించుకున్నాడు. దీంతో దొండపూడి గ్రామానికి చెందిన అంకోలు జగదీశ్ దుర్గాప్రసాద్, పోలవరంనకు చెందిన నేముల ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి శ్రీనివాస్ పథకం వేశాడు. దుర్గాప్రసాద్ మోటారుసైకిల్‌పై కొవ్వూరు, దొమ్మేరు అండర్ పాస్ వద్దకు వచ్చిన రామ శ్రీనివాస్ అక్కడ దిగి దగ్గరలో అందుబాటులో ఉండాలని దుర్గాప్రసాద్‌ను పంపించి వేశాడు. 2025 మార్చి 26వ తేదీ రాత్రి 8 గంటలకు ప్రభాకరరావుకు ఫోన్ చేశాడు. బయటకు వస్తున్న ప్రభాకరరావును భార్య ఎక్కడికి అని ప్రశ్నించడంతో కస్టమర్లు వచ్చారు బయటకు వెళుతున్నాను అని చెప్పి యాక్టివా మోటారు సైకిల్‌పై ప్రభాకరరావు బయటకు వచ్చి రామ శ్రీనివాస్‌ని ఎక్కించుకుని దొమ్మేరు పుంతలోని నీరుకొండ శేషగిరిరావు డ్రాగన్‌ఫ్రూట్ తోటలోకి వెళ్లారు. తోటలోకి నడిచివెళ్తున్న ప్రభాకరరావును రామశ్రీనివాస్ తనతో పాటు బ్యాగులో తెచ్చుకున్న కత్తితో వెనుకనుంచి తలపై, వీపుపై పలుమార్లు దాడి చేశాడు. కిందపడిన తరువాత కంఠంపై నరికివేసి కిరాతకంగా హతమార్చారు. మరణించాడని నిర్ధారించుకున్న తరువాత మృతుని మెడలో ఉన్న బంగారపు గొలుసు, ఎడమ చేతికి ఉన్న ఉంగరం తీసుకున్నాడు. కుడి చేతికి ఉన్న బంగారపు కడియం, మూడు ఉంగరాలు తీయబోగా రక్తంతో తడిచి ఉండడంతో రాకపోవడంతో మృతుని కుడిచేతి గుత్తిని నరికి చేతిని పేపర్లో చుట్టుకుని, చెయ్యి, హత్యకు ఉపయోగించిన కత్తి, మృతునివద్ద నుంచి దొంగిలించిన బంగారపు గొలుసు, ఉంగరం సెల్‌ఫోను బ్యాగులో పెట్టుకున్నాడు. దగ్గరలో ఉన్న దుర్గాప్రసాద్‌ను రమ్మని ఫోన్‌చేసి దొమ్మేరు, కాపవరం మీదుగా పోలవరం ఇంటికి వెళ్లిపోయారు. పోలవరంలో నేముల ప్రవీణ్‌కుమార్‌కు విషయం చెప్పి, ముగ్గురు కలిసి మృతుని చెయ్యికి ఉన్న కడియం, నాలుగు ఉంగరాలను తీసుకున్నారు. చెయ్యిని, కత్తిని, మృతుడు సెల్‌ఫోన్‌ని, హత్య చేసినప్పుడు రామ శ్రీనివాస్ ధరించిన బట్టలు, బ్యాగుని గూటాల గ్రామంలో గోదావరి నదిలోకి విసిరి వేశారన్నారు. దొంగిలించిన బంగారాన్ని కొయ్యలగూడెం, తాళ్లపూడి మండలాల్లో తా కట్టుపెట్టి ముగ్గురు పరారయ్యారన్నారు. మృ తుని భార్య పెండ్యాల అనంతలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.విశ్వం కేసు నమోదు చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో కేసు చేదన

విచారణ అనంతరం ఈనెల 12వ తేదీన హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను సీఐ విశ్వం అరెస్టు చేశారన్నారు. చుక్కా రామశ్రీనివాస్ నుంచి 31.8 గ్రాముల బంగారపు గొలుసు, 4.9 గ్రాముల ఉంగరం నేరానికి ఉపయోగించిన హోండా ఎస్పి మోటారు సైకిల్, 2 సెల్‌ఫోన్లు, అంకోలు జగదీశ్ దుర్గాప్రసాద్ నుంచి నేరానికి ఉపయోగించిన టీవీఎస్ రైడర్ మోటారుసైకిల్, సెల్‌ఫోను, నేముల ప్రభాకరరావు నుంచి ఒక సెల్‌ఫోను, గూటాల వద్ద గోదావరి నదిలో పడవేసిన హత్యకు ఉపయోగించిన కత్తిని, మృతుడి సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంకా దుర్గాప్రసాద్ కొయ్యలగూడెం ముత్తూట్‌లో తాకట్టుపెట్టిన బంగారపు కడియం, నేముల ప్రవీణ్‌కుమార్ తాళ్లపూడి సీఎస్‌బీ బ్యాంకులో తాకట్టుపెట్టిన బంగారపు 3 ఉంగరాలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. హత్యకు పాల్పడిన చుక్కా రామశ్రీనివాస్, సహకరించిన అంకోలు జగదీశ్ దుర్గాప్రసాద్, నేముల ప్రవీణ్‌లను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. రిమాండ్ నుంచి పోలీసు కస్టడీకి తీసుకుని తాకట్టులో ఉన్న బంగారపు వస్తువులను విడిపించి స్వాధీనం చేసుకుంటామని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. ఈ కేసులో హత్యకు సంబంధించిన ఆదారాలు లభించకపోవడంతో కేసు చేధించడంలో మొదట్లో చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో, .సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్, సీసీ పుటేజీల ఆధారంగా కేసు చేధించామన్నారు. కేసు చేదనలో కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, ఎస్ఐలు పి.రవీంద్ర, కె.శ్రీహరిరావు, కె.జగన్మోహనరావు, సిబ్బందికి డీఎస్పీ రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, ఎస్ఐలు పి.రవీంద్ర, కె.శ్రీహరిరావు, కె. జగన్మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో హిందీ విద్యార్థుల ప్రతిభ

కొవ్వూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల్లో హిందీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కొవ్వూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సున్నం సత్యనారాయణ తెలిపారు. మొదటి సంవత్సరంలో 36కి 36, ద్వితీయ సంవత్సరంలో 33కి 33 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, హిందీ అధ్యాపకుడు డాక్టర్ అయినపర్తి మురళీకృష్ణ అభినందించారు.

టీటీడీ గోవుల మరణాలపై భూమన అసత్య ప్రచారం

» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ గోమరణాలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అసత్య ప్రచారంతోపాటు మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయి అంటూ చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. 2,668 ఆవులకు జియోట్యాగ్ చేసి ప్రతిరోజు పర్యవే క్షిస్తుంటే జియోట్యాగ్ తీసేశారని విష ప్రచారం చేస్తున్నారన్నారు. కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు మా యం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్నందుకు, టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అస్యత ఆరోపణలు చేయడంపై కరుణాకర రెడ్డిపై పోలీసులు చట్టపరమైన చర్యలుతీసుకోవాలన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న భూమన

» ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



గోపాలపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో గోవుల మరణాలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలు మత విద్వేషాలు రెచ్చగొ ట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తీవ్రంగా విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భూమన కరుణాకరరెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలతో కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. తమ రాజకీయ మనగడను కాపాడుకోవడం కోసం మతవిద్వేషాలు రెచ్చగొట్టి కలియుగ దైవమైన శ్రీవెంకటేశ్వరస్వామిపై దుష్ప్రచారానికి కరుణాకరరెడ్డి మరో సారి తెరలేపారని అన్నారు. అమ్మ తరువాత గోవును గోమాతగా పూజించే గోవు సంస్కృతి సాంప్రదాయం ఈదేశంలో ఉందన్నారు. తిరుమలతిరుపతి దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీసి ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా పూటకొక దుష్ప్రచారానికి తెరలేపుతున్నారని అన్నారు. టీటీడీలో 100ఆవులు చనిపోయాయని భూమన చేసిన ఆరో పణలు అవాస్తవం అన్నారు. కరుణాకర్ రెడ్డి దురుద్దేశంతో అసత్య ప్రచారాలకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ప్రచారాలు చేసిన కరుణాకరరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలోని పాతవూరులో ఉన్న శ్రీ ఉమాచోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆదివారం కొవ్వూరు పట్టణానికి చెందిన కస్తూరి కాంతారావు, పద్మసుందరీ దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి గణపతిపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ వారరుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో కుంకుమ పూజలు, స్వామివారికి లక్ష బిల్వార్చన చేశారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణచేసి నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కౌతవరపు బాను, దేవరకొండ సాయిప్రసాద్‌లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తెన్నేటి సూర్యనారాయణ, గంప వేంకట నాగకృష్ణారావు, పమ్మి రవిబాబు, వై.ఎస్.ఎన్.శివతేజ, కస్తూరి ప్రవీణ్, గరిమెళ్ళ సత్యనారాయణశర్మ, అప్పల అయ్యపరాజు, ప్రవ సుబ్రహ్మణ్యశర్మ, చిరవూరి సుబ్రహ్మణ్యం, చవలి దుర్గాప్రసాద్, భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చివటం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయి నిరాశ్రయురాలైన వృద్ధురాలు నీలం తులసమ్మకు ఆదివారం మం డల మానవతశాఖ అధ్యక్షుడు కఠారి సిద్దార్థరాజు రూ.5వేలు ఆర్థిక సహాయం, బియ్యం బస్తా అందజేశారు. అదే విధంగా వడ్లూరు గ్రామానికి చెందిన డి. వెంకటేశ్వరరావు వెయ్యిరూపాయలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వేముల సత్యనారాయణ, నాయకులు రఘుమండ శ్రీనివాస్, ముమ్మిడి రాధాకృష్ణ పాల్గొన్నారు.



తాడిపర్రు చర్చి వద్ద ఈతమట్టలతో పాటలు పాడుతున్న చిన్నారులు



పెద్దగూడెంలో ఈతమట్టలతో ర్యాలీ చేస్తున్న లూథరన్ చర్చ్ విశ్వాసులు

ఘనంగా మట్టల ఆదివారం



కాకరపర్రులో మట్టల ఆదివారం వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం చర్చిలలో క్రైస్తవ సోదరులు మట్టల ఆదివారం కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఈత ఆకులకు పూలుగుచ్చి చర్చిల చుట్టూ ఏర్పాటు చేశారు. చిన్నారులు మట్టలను పట్టుకుని వీధుల్లో తిరగారు. పాస్టర్లు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక గీతాలను చర్చిలలో ఆలపించారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో లూథరన్, బైబిల్ మిషన్, పెంతుకొస్తు, క్రీస్తు సంఘం, ఆర్‌సీఎమ్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గోపాలపురం: మట్టల ఆదివారాన్ని మండలంలో ఆయా గ్రామాల్లోని చర్చిలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సేయింట్ థామస్ లూథరన్ చర్చ్ పెద్దగూడెంనకు చెందిన విశ్వాసులు ఈత మట్టలను పువ్వులతో అలంకరించి పురవీధుల్లో హోసన్న జయం అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వాసులు, చిన్నారులు భారీగా పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని మట్టల ఆదివారపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిలను మట్టలతో సుందరంగా అలంకరించారు. కాకరపర్రు రక్షణసైన్యం చర్చి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ కెప్టెన్ జి.స్టీవెన్‌సన్, జి.పూర్ణిమ, ఉందుర్తి వెంక టేశ్వరరావు, కె.రాము, సిర్రా శ్రీను, గుడాల శ్రీను, దిగుమర్తి అక్షింతరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో సారవంతంగా భూమి



వాదాలకుంటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోపాలపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా మారుతుందని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వాదాలకుంట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్‌కు సంబంధించిన అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజ్యలక్ష్మీ, ఎం.అరుణ, శేషగిరి, స్వయం సహాయ సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

కొవ్వూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)పుట్టినరోజును పురస్కరించుకుని మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అచ్చిబాబు పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని దొమ్మేరు బస్టాండ్ సెంటర్‌లో జనసేన నాయకులు గంగుమళ్ళ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు ప్రారంభించారు. వేసవిని పురస్కరించుకుని పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అంధులు, వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, కలగర సుబ్బారావు, గారపాటి రామకృష్ణ, కలగర రంగారావు, భుజంగం పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీచేస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు

ఆధునిక భారతానికి పితామహుడు అంబేడ్కర్

» ప్రముఖ రచయిత సతీష్‌చందర్



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత సతీష్ చందర్

నల్లజర్ల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆధునిక భారతానికి పితా మహుడు భారతరత్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ అని ప్రముఖ రచయిత వి.సతీష్‌చందర్ అన్నారు. నల్లజర్ల మండల అంబేడ్కర్ వాదుల ఐక్యవేదిక సభ్యులు శనివారం రాత్రి జగన్నాథపురంలో అంబేడ్కర్ జయంతిని ముందుగానే జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అంబేడ్కర్ అనుభవించిన చేదు అనుభవాలు నేటి యువత అనుభవించకుండా ఉండేందుకు రాజ్యాంగం అనే బంగారు గ్రంథాన్ని రచించి బంగారు బాటలువేసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ప్రపంచ దేశాలను ఐక్యపర్చడంతో అంబేడ్కర్ ఎంతో కృషిచేసినట్లు పేర్కొన్నారు. అపార ప్రపంచ మేధావిగా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. అంబేడ్కర్ భావజాలం నేటి యువత కలిగి ఉండాలన్నారు. మనం రాజ్యాంగ ఫలాలు అనుభవించడం కాదు మనం దేశానికి ఏవిధంగా ఉపయోగపడుతున్నాం అనే విధానంకలిగి ఉండాలన్నారు. నేటి ప్రభుత్వాలు సైతం కార్పొరేట్ సంస్థలో దళితులకు ఉద్యోగాలు ఇవ్వడంలేదని, ప్రభుత్వ కాంట్రాక్ట్ వర్కులు అగ్రవర్ణాలకే దక్కుతున్నాయని విమర్శించారు. టీడీపీ మండల కార్యదర్శి గుదే సుబ్బారావు అంబేడ్కర్ వేషధారణ పలువురిని ఆలరించింది. ముందుగా నల్లజర్ల నుంచి జగన్నాథపురం పాద యాత్రగా వెళ్లి అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంజి మధు, కె.శివాజీ, వి.రవికుమార్, అనంద్ కుమార్, అంబేడ్కర్ సంఘం గౌరవాధ్యక్షుడు పిల్లి కాంతారావు, బొందల శ్రీని వాసరావు, గుదె శ్రీను, బోడ్డు శ్రీను పాల్గొన్నారు. సమావేశం అనంతరం 2వేలమందికి విందు ఏర్పాటుచేశారు.

తేలికపాటి వర్షంతో రైతుల కష్టాలు



చాగల్లులో వర్షానికి తడవకుండా ధాన్యంపై బరకాలు కప్పిన రైతులు

చాగల్లు, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): మండలంలో గతవారం రోజులుగా వాతావరణం మేఘావృతమై ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురుస్తోంది. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో వాతావరణంలోని మార్పులు రైతులను కష్టాల పాలు చేస్తున్నాయి. రైతులు కళ్లాల్లోని ధాన్యం తడిసిపోకుండా తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆదివారం మండలంలో పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసింది. రైతులు కోతలు పూర్తిచేసుకుని ధాన్యం కళ్లంలో ఆరబెట్టుకున్న తరుణంలో అకాలవర్షం కురవడంతో అష్టకష్టాలుపడి ధాన్యంను భద్రపరుకుంటున్నారు. మండలంలో సుమారు 8500 ఎకరాల్లో రైతులు వరి పండించగా సగం వరకు వరి కోతలు పూర్తయ్యాయి. ఈ తరుణంలో వా తావరణం మార్పు రైతులను ఆందోళనకు గురిచేస్తుంది.

విలువలతో గుణాత్మక విద్యను అందించాలి

● ఘనంగా శతాబ్ది వార్షికోత్సవం

గోపాలపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) ప్రశాంతమైన వాతావరణంలో గుణాత్మకమైన విద్యాబోధన జరగాలంటే విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రశ్నించే సామర్థ్యం తప్పనిసరి అని ఎంఈవో జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో 100వ వార్షికోత్సవం (శతాబ్ది) ఆదివారం ప్రధానోపాధ్యాయుడు కురుకూరు వీరభద్రుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గుడికి మొక్కినట్లే బడికి మొక్కులను, పిల్లలకు చదువుని వారసత్వంగా ఇవ్వాలన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలో సాంకేతిక విద్యతోపాటు ఆధునిక విద్యను అందిస్తున్నామన్నారు. పోటీ ప్రపంచానికి ధీటుగా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుతోపాటు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అలరించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. కార్యక్రమంలో సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, బొర్రా అంజనేయులు, మాజీ సర్పంచ్ ఆకుల రాము, ఎస్ఎంసీ చైర్మన్ మిర్చి సరోజిని, సీఆర్‌పీ కొయ్య నాగరాజు, దాతలు, గ్రామపెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



వ్యాన్ ప్రమాదంలో గాయపడిన యువకుడు

నిడదవోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం గోపవరంవద్ద ఆదివారం రాజమహేంద్రవరం నుంచి నిడదవోలు వైపు వస్తున్న గూడ్స్ వ్యాన్‌ను నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న మోటారు సైకిలిస్టు సురేష్ ఢీకొనడంతో మోటారు సైకిలిస్టుకు గాయాలయ్యాయి. గాయాల పాలైన రాజమహేంద్రవరానికి చెందిన యువకుడు బి.సురేష్‌గా గుర్తించి స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108లో గాయపడిన సురేష్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కరాటే నేర్చుకోవడం ఆత్మరక్షణకు దోహదం

● డీఎస్పీ దేవకుమార్

దేవరపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కరాటే నేర్చుకోవటం మానసిక ప్రశాంతతకు, శారీరక ధృడత్వానికి, ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ పేర్కొన్నారు. దేవరపల్లిలో అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం సాయంత్రం గోపాలపురం నియోజకవర్గస్థాయిలో కరాటే పోటీల్లో 30మంది బ్లాక్‌బెల్ట్ సాధించిన కరాటేవిద్యార్థులకు డీఎస్పీ మెమొంటోలు, బ్లాక్ బెల్ట్ పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా కరాటే మాస్టారు జక్కంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా డీఎస్పీ దేవకుమార్ పాల్గొని మాట్లాడుతూ నేటియువత కరాటేని నేర్చుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. కరాటేలో బాలురు, బాలికలు శిక్షణ పొందటం ఎంతో అభినందనీయమని గ్రామీణ ప్రాంతంలో కరాటే శిక్షణ తరగతులు నిర్వహించటం రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇచ్చిన కరాటే చైర్మన్ కేతా శ్రీనివాస్, కరాటే మాస్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్‌ను ఆ యన అభినందించారు. ముందుగా కరాటే విద్యార్థులు పలు విన్యాసాలు నిర్వహించారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్